www.samasamajam.in

# సమ సమాజం

శుక్రవారం 13-1-2023

సంపుటి - 07, సంచిక-234
పేజీలు - 8 వెల రూ. 5/-

SAMA SAMAJAM TELUGU DAILY

RNI No: TELTEL/2016/73311

ప్రశ్నించే అక్షరం... ప్రజలకోసం...

పుష్యమి, కృష్ణపక్షం, షష్ఠి 6.13 సా॥, సప్తమి 7.23 సా॥, రాహు కాలం 11.01 ఉ॥ నుంచి 12.24 సా॥ వరకు, యమగండం 3.10 సా॥ నుంచి 4.33 సా॥ వర్జ్యం 1.34 ఉ॥ నుంచి 3.16 ఉ॥, అమృత కాలం 8.44 ఉ॥ నుంచి 10.29 ఉ॥ వరకు, అభిజిత్ ముహూర్తం 12.2 సా॥ నుంచి 12.46 వరకు

Published From Hyderabad Circulated by Hyderabad, Rangareddy, Nalgonda, Warangal, Medak, Karimnagar, Kammam, Vishakapatnam, Vijayawada, Ongole



## సంపాదకీయం

# గవర్నర్ల తీరుతో తలవంపులు

తమిళనాడు గవర్నర్ రవి వ్యవహారంతో ఇప్పుడు మరోమారు గవర్నర్ వ్యవస్థపై దుమారం చెలరేగు తోంది. గవర్నర్ వ్యవస్థ కేంద్రంలో అధికారంలో ఉన్న వారికి జేబుసంస్థగా మారింది. ప్రజలకు ఎలాంటి ఉపయోగం లేని ఈ వ్యవస్థను రద్దు చేయడం ద్వారా దేశ ఖజనాపై భారాన్ని తగ్గించుకోవచ్చు.ప్రధాని మోడీ రాజకీయ అవసరాల కోసం గవర్నర్లను ఉపయోగించుకుంటున్న తీరు వివాదాస్పదంగా మారింది. ఇప్పుడు పాలకులు ఎవరన్నది ముఖ్యం కాదు. ప్రధానంగా గవర్నర్ వ్యవస్థ రద్దుపై దృష్టి సారించాలి. ఎందుకంటే ఇది దేశానికి ఆర్థికంగా భారంగా మారింది. ప్రజల సొమ్ముతో ఈ వ్యవస్థ వల్ల ఏటా కోట్లాది రూపాయలు వృధా అవుతున్నాయి. దీనికితోడు రాజకీయాలకు రాజ్‌భవన్‌లు వేదికగా మారుతున్నాయి. అలాగే రాజకీయ పునరావాసంగా గవర్నర్లను నియమిస్తున్నారు. తాబేదార్లను నియమించే ఈ వ్యవస్థతో ఉపయోగం లేకపోగా ఆర్థికంగా భారం పడుతోంది. అందువల్ల తక్షణం గవర్రనర్ వ్యవస్థను రద్దు చేస్తే దేశానికి, ఆర్థికరంగానికి మేలు చేసిన వారు అవుతారు. గతంలో అనేక అనుభవాలు చూశాం. ఏ విధంగా గవర్నర్ వ్యస్థను ఉపయోగించి రాష్ట్ర ప్రభుత్వాలను అస్థిర పరిచారో? గవర్నర్ల వ్యవస్థ అనవసరమని అనుకుంటున్న తరుణంలో వారంతా రాజ్యాంగ విరుద్ధంగా ప్రవర్తిస్తున్నారు. తాజాగా తమిళనాడు గవర్నర్ ఆర్.ఎన్.రవి చర్యలు ముమ్మాటికి సమాఖ్య స్ఫూర్తిపై దాడి అన్నవిమర్శలు వస్తున్నాయి. అలాగే తెలంగాణలో తమిళసై కూడా రాజకీయాల్లో వేలు పెడుతున్నారని బిఆర్ఎస్ ప్రభుత్వ ఆరోపిస్తోంది. ఒకటి కాదు..రెండు కాదు.. అనేక రాష్ట్రాల్లో ఇప్పుడు గవర్నర్ల తీరు చర్చగా మారింది. తమిళనాడు గవర్నర్‌గా రిటైర్డ్ ఐపిఎస అధికారి రవి నియమితులైనప్పటి నుండి ఆయన వివాదాస్పదంగానే వ్యవహరిస్తున్నారు. ఆయన తీరుపై ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎం.కె స్టాలిన్ ఎప్పటి కప్పుడు అభ్యంతరాలు వ్యక్తం చేయడంతో పాటు,కేంద్ర ప్రభుత్వానికి లేఖలు కూడా రాశారు. తాజాగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు డిఎంకె ఫిర్యాదు చేసింది. ప్రభుత్వం రూపొందించిన ప్రసంగ పాఠానికి తన ఇష్టం వచ్చినట్లు మార్పులు చేర్పులు చేసి రాష్ట్ర శాసనసభలో చదవడం దీనికి పరాకాష్ట. దీనిపై పెద్ద ఎత్తున విమర్శలు చెలరేగుతుండగానే సివిల్ సర్వీసు అభ్యర్థులతో బుధవారం జరిపిన ముఖాముఖిలో కేంద్రం చెప్పినట్లు మాత్రమే నడుచుకోవాలని చెప్పడాన్ని బరితెగింపుగానే అర్థం చేసుకోవాలి. మాజీ ఐపిఎస్ అధికారి అయిన రవికి రాజ్యాంగం, దాని నిర్దేశాలు, ప్రజాస్వామ్య సాంప్రదాయాల గురించి తెలియవని అనుకోలేం. ఇదంతా ఉద్దేశ్యపూర్వకంగానే ఏస్తున్నారని అనుకోవాలి. తమిళగం పేరును రాష్ట్రానికి పెట్టాలని గవర్నర్ ప్రవచిస్తున్న తీరు సరికాదు. ఇది ఆయన పరిధిలో లేనిదనే చెప్పాలి. శాసనసభలో చదవడానికి రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన ప్రసంగపాఠంలోనూ తమిళనాడుకు బదులుగా తమిళగంను ఆయన చేర్చి చదవడం అన్నది తన పరిధిని దాటి చేసిన చర్యగా చూడాలి. అందుకే గవర్నర్ ప్రసంగానికి బదులుగా రాష్ట్ర ప్రభుత్వం ఆమోదించిన ప్రసంగపాఠాన్నే శాసనసభ రికార్డుల్లో చేర్చాలని ముఖ్యమంత్రి స్టాలిన్ ప్రతిపాదించాల్సి వచ్చింది. దానిని సభ ఏకగ్రీవంగా ఆమోదించడం జరిగింది. శాసనసభలో చదవాల్సిన ప్రసంగపాఠాన్ని రాష్ట్ర ప్రభుత్వం ముందుగానే గవర్నర్‌కు పంపుతుంది. దానిని పరిశీలించి, ఆమోదించిన తరువాతే తుది పాఠాన్ని ఖరారు చేస్తారు. ఒక వేళ అభ్యంతరాలుంటే, తెలియచేస్తే ప్రభుత్వం సవరించే అవకాశం ఉంటుంది. ఒకవేళ సవరించకుండా అదే ప్రసంగాన్ని మళ్ళీ పంపితే గవర్నర్ దానిని ఆమోదించాల్సిందే. అలా ఆమోదించిన ప్రసంగాన్నే సభలో చదవాలి. ఇది రాజ్యాంగ సంప్రదాయం! అత్యున్నత న్యాయస్థానం కూడా అనేక సందర్భాల్లో దీనినే ధృవీకరించింది. రాష్ట్రపతి, గవర్నర్లకు విధి నిర్వహణలో సొంత అభిప్రాయాలకు తావు లేదంటూ రాజ్యాంగ నిర్దేశిస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం పంపిన ప్రసంగ పాఠాన్ని ఆమోదించి, చదవాల్సిన సమయంలో దానిని పక్కన పెట్టి సొంత అభిప్రాయాలనో, తనను నడిపించే వారి అభిప్రాయాలనో ఏకరువు పెట్టడం ద్వారా రాజ్యాంగ విలువలను గవర్నర్ రవి తుంగలో తొక్కారు. గవర్నర్‌ను కేంద్ర ప్రభుత్వమే నియమిస్తుంది. కేంద్ర ప్రభుత్వ ప్రతినిధిగా కూడా ఆయన భావించవచ్చు. సమాఖ్య వ్యవస్థ బలపడాలంటే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల మధ్య సంధానకర్తలుగా గవర్నర్లు వ్యవహరించాలి. సమన్వయానికి చొరవ చూపాలి. కానీ అలా జరగడం లేదు. దేశంలో గవర్నర్ల తీరు తరచూ వివాదాస్పదం అవుతోంది. నరేంద్ర మోడీ ప్రభుత్వం వచ్చిన తరువాత ఎన్నికైన రాష్ట్ర ప్రభుత్వాలతో గవర్నర్ల ఘర్షణ ధోరణి పెరిగింది. కేరళ, పశ్చిమ బెంగాల్, తెలంగాణ,తమిళనాడు ఇలా చెప్పుకుంటూ పోతే జాబితా చాలా ఉంది. ఇది యాదృచ్ఛికంగా జరుగుతున్నది కాదు. రాష్ట్రాను బలహీన పరిచి, బలమైన కేంద్రాన్ని ఏర్పాటు చేయాలన్న బిజెపి సిద్ధాంతంలో భాగంగానే ఈ దాడులు జరుగుతున్నాయి. వీటిని ప్రతిఘటించి, సమాఖ్య వ్యవస్థను, ప్రజాస్వామ్య విలువలను కాపాడుకోవాల్సిన బాధ్యత భారత ప్రజలందరిది. గవర్నర్ల వ్యవస్థను ఎత్తేయాల్సిన అవసరం ఇటీవలి వరుస ఘటనలు రుజువు చేస్తున్నాయి. ఇన్నాళ్లూ కాంగ్రెస్ పార్టీ గవర్నర్ల వ్యవస్థను అపహాస్యం చేసింది. ఇష్టారాజ్యంగా వాడుకుంది. రాజ్‌భవన్లను ఆయా రాష్ట్రాల కాంగ్రెస్ పార్టీ కేంద్ర కార్యాలయాలుగా వాడుకుంది. అలాంటి కాంగ్రెస్ పార్టీని మించి బిజెపి కూడా అదేతోవలో నడవడం వాంఛనీయం కాదు. వ్యవస్థలను నిర్వీర్యం చేసి, రాజ్యాంగాన్ని అపహస్యం చేసిన పార్టీగా కాంగ్రెస్ చరిత్రలో నిలిచిపోయింది. మోడీ నేతృత్వంలోని బిజెపి కూడా కాంగ్రెస్ బాటలోనే నడవడం మంచి పరిణామం కాదు. కేంద్రానికి, రాష్ట్రానికి మధ్య సంధానకర్తలుగా నిలిచి సమాఖ్య వ్యవస్థ బలపడేలా చూడాల్సిన గవర్నర్ల వ్యవస్థను స్వార్థ ప్రయోజనాల కోసం పాలక పార్టీలు బలి చేసిన తీరును దేశ ప్రజానీకం గతంలో అనేకం చూసింది. కేరళలో నంబూద్రిపాద్ మొదలు అనేక రాష్ట్రాల్లో గవర్నర్ల వ్యవస్థను కాంగ్రెస్ భ్రష్టుపట్టించింది. యూపిలో గతంలో జగదాంబికాపాల్‌ను సీట్లో కూర్చుండబెట్టింది కాంగ్రెస్ ప్రభుత్వమే. ఉమ్మడి ఎపిలో ఎన్టీఆర్‌ను దించి నాదెండ్ల భాస్కర్ రావును గద్దెపై కూర్చో బెట్టారు. నిజానికి ఇదంతా వ్యవస్థీకృతంగా ఉన్న లోపం. దీనిపై చర్చించాలి. ఇలాంటి తప్పిదాలు లేకుండా రాజ్యాంగంలో మార్పులు చేసుకోవాలి. మొత్తంగా ఆరోవేలులాగా ఉన్న గవర్నర్ వ్యవస్థను రద్దు చేయడం ఒక్కటే పరిష్కారం కాగలదు.

పృధ్విరాజ్ గోసుకొండ
ఎడిటర్



# కెసిఆర్ పర్యటనతో కాంగ్రెస్ నేతల అరెస్ట్

### పోలీసుల తీరుపై మండిపడ్డ రేవంత్ రెడ్డి

హైదరాబాద్,జనవరి12(సమసమాజం): ముఖ్యమంత్రి కెసిఆర్ భద్రాద్రి పర్యటన సందర్భంగా కాంగ్రెస్ నేతలను అరెస్ట్ చేయడంపై టీపీసీసీ అధ్యక్షుడు, ఎంపీ రేవంత్ రెడ్డి పోలీసుల తీరుపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. కేసీఆర్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పర్యటన సందర్భంగా కొత్తగూడెంలో కాంగ్రెస్ నాయకులను ముందస్తు అరెస్టులు చేయడం అప్రజాస్వామికమని, ఇది నియంత పాలనకు పరాకాష్ట అని అన్నారు. సీఎం కేసీఆర్ పర్యటనకు వస్తుంటే ప్రధాన ప్రతిపక్ష పార్టీ కాంగ్రెస్ నాయకులను అర్ధరాత్రి నుంచి అరెస్టులు చేయడం... పోలీస్ స్టేషన్లలో నిర్బంధించడం ఏంటని అన్నారు. ఇదేమైనా రాజరికమా అని ప్రశ్నించారు. అరెస్టులు చేసిన కాంగ్రెస్ నాయకులను, కార్యకర్తలను వెంటనే బేశరతుగా విడుదల చేయాలని, విడుదల చేయకపోతే ఆందోళనకు దిగుతామని రేవంత్ రెడ్డి హెచ్చరించారు. గురువారం కొత్తగూడెంలో సీఎం కేసీఆర్ పర్యటన సందర్భంగా కాంగ్రెస్, బీజేపీ, ఆదివాసీ నాయకులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పోలీసుల చర్యలను ఆదివాసి అభ్యుదయ సంఘం నాయకులు ఖండించారు. కొత్తగూడెం జిల్లా బీజేపీ అధ్యక్షుడు కోనేరు సత్యనారాయణను పోలీసులు హౌస్ అరెస్ట్ చేశారు.

# బస్సును ఢీకొన్న లారీ: మహిళ మృతి

ములుగు,జనవరి12(సమసమాజం):ములుగు జిల్లాలోని మంగపేటలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ మహిళ మృతిచెందింది. గురువారం తెల్లవారుజామున మంగపేట మండలంలోని రాజుపేట వద్ద ఆర్టీసీ బస్సును ఓ లారీ ఢీకొట్టింది. దీంతో బస్సులో ప్రయాణిస్తున్న ఓ మహిళ మరణించారు. పలువురు గాయపడ్డారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. గాయపడినవారిని దవాఖానకు తరలించారు. బస్సు విశాఖపట్నం నుంచి హనుమకొండకు వస్తుండగా ప్రమాదం జరిగిందని తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.



# వివేకానంద స్ఫూర్తితో సాగుదాం

### నిరంకుశ ప్రభుత్వంపై పోరాడుదాం
### యువతకు లోకేశ్ పిలుపు



అమరావతి,జనవరి12(సమసమాజం): వివేకానంద జయంతిని పురస్కరించుకొని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భారతీయ యువతరంలో చైతన్యం నింపడానికి, ఆత్మ విశ్వాసం కలిగించడానికి తన జీవితమంతా కృషి చేసిన స్వామి వివేకానంద జయంతి సందర్భంగా ఆ మహాశయుని స్మృతికి నివాళులు అర్పిస్తున్నానన్నారు. జాతీయ యువజనోత్సవ దినం సందర్భంగా లోకేష్ యువతకు శుభాకాంక్షలు తెలిపారు. సంకల్పం ఉన్న యువత ఈ దేశానికి అవసరమన్నారు వివేకానంద, ఏపీలో యువత నిరాశ, నిస్పృహలో కూరుకుపోయి ఉందని లోకేష్ వ్యాఖ్యానించారు. జాబ్ కాలెండర్ రాదు.. పరిశ్రమలు రావు.. ఈ ప్రభుత్వానికి యువతరమే బుద్ధి చెప్పే రోజు త్వరలో రానుందని, అప్పుడు నిజమైన యువజనోత్సవాలను ఘనంగా చేసుకుందాం అన్నారు. అప్పటివరకు మార్పు కోసం కృషి చేద్దామని ఆయన అభిప్రాయం వ్యక్తం చేశారు. భారతీయ యువతరం లో చైతన్యం నింపడానికి, ఆత్మ విశ్వాసం కలిగించడానికి తన జీవితమంతా కృషి చేసిన మహాశయుడు స్వామి వివేకానంద అని అన్నారు. ఈ రోజును జాతీయ యువజన దినోత్సవంగా జరుపుకుంటున్న వేళ తెలుగు యువతకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఇనుప కండరాలు, ఉక్కు నరాలు, వజ్ర సంకల్పం ఉన్న యువత ఈ దేశానికి అవసరమని స్వామి వివేకానంద అన్నారన్నారు. కానీ ఏపీలో యువత అడుగడుగునా నిరాశ, నిస్పృహలో కూరుకుపోయిందని తెలిపారు. జాబ్ కాలెండర్ రాదు. పరిశ్రమలు రావు. ఉద్యోగ నోటిఫికేషన్లు రావు. స్వయం ఉపాధి రుణాలు మంజూరు కావు. విదేశీ విద్యకు సాయం లేదని విమర్శించారు. యువతను పూర్తిగా నిర్లక్ష్యం చేస్తున్న ఈ ప్రభుత్వానికి యువతరమే బుద్ధి చెప్పే రోజు త్వరలో రానుందన్నారు. అప్పుడు నిజమైన యువజనోత్సవాలను ఘనంగా చేసుకుందామని... అప్పటివరకు మార్పు కోసం కృషి చేద్దామని లోకేష్ పిలుపునిచ్చారు.

# కాంగ్రెస్ ఇన్‌ఛార్జ్ మాణిక్‌రావుతో కోమటిరెడ్డి భేటీ

### తాజా రాజకీయాలపై ఇరు నేతల చర్చలు



హైదరాబాద్,జనవరి12(సమసమాజం): తెలంగాణ కాంగ్రెస్‌లో వివాదాలు ఇప్పట్లో సమసేలా కనిపించడంలేదు. పీసీసీ కమిటీలను తాను పట్టించుకోనని, నాలుగైదు సార్లు ఓడినవారితో తాను కూర్చోవాలా అని ఎంపీ కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ప్రశ్నించారు. పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జ్‌గా నియమితులైన మాణిక్‌రావ్ థాక్రే బుధవారం రాష్ట్రానికి వచ్చారు. ఈ సందర్భంగా ఆయన ఎంపీ కోమటిరెడ్డి గాంధీభవన్‌కు రావాల్సిందిగా ఆహ్వానించారు. అయితే తాను పార్టీ ప్రధాన కార్యాలయానికి రాలేనని ఆయన తెల్చిచెప్పారు. బయట కలుస్తానని ఆయనకు ఫోన్‌లో తెలిపారు. ఈ నేపథ్యంలో హైదరాబాద్‌లోని హైదర్‌గూడ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో థాక్రేతో భేటీ అయ్యారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. తనకు ఏఐసీసీ ఇచ్చిన షోకాజ్ నోటీసులు చెత్తబుట్టలో పడ్డాయని చెప్పారు. నియోజకవర్గంలో బిజీగా ఉండటంతోనే బుధవారం గాంధీభవన్‌కు రాలేకపోయానని చెప్పారు. అయినా పార్టీ ఎమ్మెల్యేలు జగ్గారెడ్డి, పొదెం వీరయ్య, సీతక్క కూడా నిన్న పార్టీ కార్యాలయానికి రాలేదని, వారిని ఎందుకు అడగరని ప్రశ్నించారు. తమ ఫొటోలు మార్ఫింగ్ చేసిన విషయాన్ని ఏఐసీసీ పట్టించుకోలేదని చెప్పారు. ఫొటో మార్ఫింగ్ అయిందని స్వయంగా సీపీ తనకు చెప్పారని వెల్లడించారు.

## హిందువుల మనోభావాలు దెబ్బతీస్తున్న జగన్

### మాజీ ఎమ్మెల్యే విష్ణుకుమార్ విమర్శలు

విశాఖపట్టణం,జనవరి12(సమసమాజం): హిందూవుల మనోభావాలు దెబ్బతీయడానికి సీఎం కుట్రలు చేస్తున్నారని ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డిపై బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు విష్ణుకుమార్ రాజు కీలక వ్యాఖ్యలు చేశారు. గురువారం ఆయన ఇక్కడ మీడియాతో మాట్లాడుతూ వచ్చే సంక్రాంతి తర్వాత.. జగన్ ఇంటికేనని.. దేవాలయాలపై దాడి చేసిన వారిని ఎవరూ పట్టించుకోరని, తిరుమలకు భక్తులు రాకుండా ఉండేందుకు కుతంత్రాలు జరుగుతున్నాయన్నారు. టీటీడీ వసతి గృహాలు అద్దెలు పెంచడం అంటే... భక్తుల నుంచి దోపిడీ చేయడమేనని అన్నారు. వెంకటేశ్వర స్వామి దగ్గరకు భక్తులు రాకూడదనే దురుద్దేశ్యంతోనే ఇటువంటి నిర్ణయాలు తీసుకుంటున్నారని విమర్శించారు. టీటీడీ వసతి గృహాల అద్దెలు పెంపు నిర్ణయాన్ని తక్షణమే ఉపసంహరించుకోవాలని, లేని పక్షంలో తీవ్ర స్థాయిలో ఉద్యమిస్తామని విష్ణుకుమార్ రాజు స్పష్టం చేశారు.

# మానుకోటలో బిఆర్ఎస్ కార్యాలయం ప్రారంభం

### సమీకృత కలెక్టరేట్‌కు కూడా ప్రారంభోత్సవం
### వేదోక్తంగా పూజలు చేసి ప్రారంభించిన కెసిఆర్
### కార్యక్రమంలో పాల్గొన్న మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు



మహబూబాబాద్,జనవరి12(సమసమాజం) : మానుకోట జిల్లాలో బీఆర్ఎస్ పార్టీ కార్యాలయాన్ని వేదపండితుల పూజలు, ఆశర్వచనాల మధ్య సీఎం కేసీఆర్ ప్రారంభించారు. అనంతరం పార్టీ అధ్యక్ష సీటులో ఎంపి మాలోత్ కవితను కూర్చోబెట్టిన కెసిఆర్ ఆశిస్సులు అందించారు. కేసీఆర్ రాక సందర్భంగా మానుకోట పట్టణాన్ని సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు. రోడ్ల వెంట మొక్కలు నాటి ట్రీగార్డులు ఏర్పాటు చేశారు. డివైడర్లు, గోడలకు రంగులు వేశారు. ఆఫీసర్లు రేయింబవళ్లు శ్రమించి పనులు చేయించారు. అదనపు సిబ్బందిని కేటాయించి వీధుల్ని శుభ్రం చేయించారు. పోలీసులు 1600 మందితో బందోబస్తు ఏర్పాటు చేశారు.వీధులన్నీ గులాబీ పతాకలతో రెపరెపలాడాయి. జిల్లా కేంద్రమైన మానుకోటలో కొత్తగా నిర్మించిన బీఆర్ఎస్ పార్టీ కార్యాలయాన్ని ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రారంభించారు. పార్టీ జెండాను ఆవిష్కరించారు. పార్టీ కార్యాలయంలో జరిగిన పూజల్లో పాల్గొన్నారు. అనంతరం బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు, ఎంపీ కవితను కుర్చీలో కూర్చోబెట్టి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మంత్రులు సత్యవతి రాథోడ్, ఎర్రబెల్లి దయాకర్ రావు, వేముల ప్రశాంత్ రెడ్డి, ఎమ్మెల్యేలు శంకర్‌నాయక్, రాజయ్య, గండ్ర వెంకటరమణారెడ్డి,ఎమ్మెల్సీలు పల్లా రాజేశ్వర్ రెడ్డి, కడియం శ్రీహరి పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. అంతకుముందు మహబూబాబాద్ చేరుకున్న సీఎం కేసీఆర్‌కు మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం మహబూబాబాద్ సమీకృత కలెక్టరేట్ భవనాన్ని కెసిఆర్ ప్రారంభించారు. వేద మంత్రోచ్ఛరణాల మధ్య పూజలు చేపట్టారు. పూజల అనంతరం కలెక్టర్ కార్యాలయంలో సీట్లో కలెక్టర్ శశాంక్‌ను కూర్చోబెట్టారు.మహహబూబాద్ జిల్లా కేంద్రంలో సమీకృత కలెక్టరేట్ భవనాన్ని కొత్తగా నిర్మించారు. అంతకుముందు కార్యాలయానికి చేరుకున్న ముఖ్యమంత్రి కేసీఆర్ పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. ఆ తర్వాత కార్యాలయాన్ని ప్రారంభించి, ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అనంతరం చాంబర్‌లో కలెక్టర్ శశాంకను సీట్‌లో కూర్చుండబెట్టి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మంత్రులు ప్రశాంత్ రెడ్డి, ఎర్రబెల్లి దాయకర్ రావు, సత్యవతి రాథోడ్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, ఎంపీ కవిత, ఎమ్మెల్సీలు కడియం శ్రీహరి, పల్లా రాజేశ్వర్ రెడ్డి, ఎమ్మెల్యేలు శంకర్‌నాయక్, రాజయ్యతోపాటు పలువురు బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, ఇతర నాయకులు పాల్గొన్నారు. ప్రారంభోత్సవం అనంతరం సర్వమత ప్రార్థనలు జరిగాయి. మరో వైపు సీఎం పర్యటన నేపథ్యంలో జిల్లాలో ప్రతిపక్ష నేతలను నిన్న రాత్రి నుంచి ముందస్తు అరెస్ట్ చేస్తున్నారు.

# సిఎం జగన్‌తో సోమేశ్ కుమార్ భేటీ

### తాజా పరిస్థితులు వివరిస్తూ రిపోర్ట్



అమరావతి,జనవరి12(సమసమాజం): ఏపీ సీఎం జగన్ మోహన్ రెడ్డితో తెలంగాణ మాజీ సీఎస్ సోమేశ్ కుమార్ భేటీ అయ్యారు. తాడేపల్లి సీఎం క్యాంప్ కార్యాలయంలో దాదాపు గంటసేపు జగన్‌తో భేటీ అయ్యారు. సోమేశ్ కుమార్‌తో ఏపీ సీఎస్ జవహర్ రెడ్డి కూడా ఉన్నారు. సిఎంతో తాజా పరిస్థితులను వివరించినట్లు సమాచారం. అంతకుముందు విజయవాడ ఎయిర్ పోర్ట్ లో మాట్లాడిన సోమేశ్ కుమార్.. ప్రభుత్వ అధికారిగా ఏపీ ప్రభుత్వం తనకు ఏ బాధ్యత ఇచ్చినా నెర వేరుస్తానని అన్నారు.. డీవోపీటీ అదేశాల మేరకే తాను ఏపీ ప్రభుత్వానికి రిపోర్టు చేస్తానని చెప్పారు. సోమేశ్ కుమార్‌కు ఏపీ క్యాడర్‌కు వెళ్లాలని ఇటీవల తెలంగాణ హైకోర్టు ఆదేశించింది. తెలంగాణకు సోమేశ్ కుమార్ కేటాయింపును రద్దు చేసిన ధర్మాసనం.. సర్టిఫైడ్ కాపీ అందిన వెంటనే ఏపీకి వెళ్లాలని ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్ర విభజన సమయంలో సోమేశ్ కుమార్‌ను కేంద్రం ఏపీకి కేటాయించింది. అయితే కేంద్రం ఉత్తర్వులపై ఆయన క్యాట్?ను ఆశ్రయించడంతో 2016లో సోమేశ్ కుమార్ తెలంగాణలో కొనసాగేలా హైదరాబాద్ క్యాట్ ఉత్తర్వులు జారీ చేసింది. క్యాట్ ఉత్తర్వులతో అప్పటి నుంచి సోమేశ్ తెలంగాణలోనే కొనసాగుతూ వచ్చారు.

www.samasamajam.in

శుక్రవారం
13-1-2023
సంపుటి - 07, సంచిక-234
పేజీలు - 4
వెల రూ. 5/-
RNI No: TELTEL/2016/73311

# సమ సమాజం

SAMA SAMAJAM TELUGU DAILY NEWS PAPER

ప్రశ్నించే అక్షరం... ప్రజలకోసం...

పుష్యమి, కృష్ణపక్షం, షష్ఠి 6.13 సా॥, సప్తమి 7.23 సా॥, రాహు కాలం 11.01 ఉ॥ నుంచి 12.24 సా॥ వరకు, యమగండం 3.10 సా॥ నుంచి 4.33 సా॥ వర్జ్యం 1.34 ఉ॥ నుంచి 3.16 ఉ॥, అమృత కాలం 8.44 ఉ॥ నుంచి 10.29 ఉ॥ వరకు, అభిజిత్ ముహూర్తం 12.2 సా॥ నుంచి 12.46 వరకు

Published From Hyderabad Circulated by Hyderabad, Rangareddy, Nalgonda, Warangal, Medak, Karimnagar, Kammam, Vishakapatnam, Vijayawada, Ongole

# ఖమ్మం నుంచి యుద్ధ భేరీ


## కొత్తగూడెం సభలో మరోమారు బిజెపిని ఏకి పారేసిన కెసిఆర్




- కేంద్రం విధానాలు దేశానికి వినాశకరం
- ఏళ్లు గడుస్తున్నా రాష్ట్రాల్లో నీటి సమస్యలు తెగవ్
- దేశంలో సాగునీటి వినయోంలో పూర్తి నిర్లక్ష్యం
- ఢిల్లీలో తాగునీటి సమస్యను కూడా పరిష్కరించలేరు
- కేంద్రం వల్ల తెలంగాణకు 3 లక్షల కోట్లు నష్టం
- దద్దమ్మ పాలనను గద్దె దించుదాం అని పిలుపు

భద్రాద్రి కొత్తగూడెం,జనవరి12 (సమసమాజం): ఖమ్మం నుంచే యుద్ధభేరీ మోగిస్తున్నాం. దద్దమ్మ పాలనను గద్దె దించాల్సిందే. నీటి తగవులను కూడా పరిష్కరించలేని అర్భకులు..అంటూ కెసిఆర్ కేంద్రంలోని మోడీ సర్కార్‌పై విమర్శలు గుప్పించారు. రాష్ట్రాలమధ్య నదీ వివాదాల సమస్యల పరిష్కారంలో కేంద్రం అనుసరిస్తున్న విధానాలను సీఎం కేసీఆర్ తూర్పారాబట్టారు. దేశంలో నీటి యుద్ధాలు జరుగుతున్నా పట్టించుకోకుండా ఉంటారా అని అన్నారు. కావేరి నదిపై తమిళనాడు, కర్ణాటక కొట్లాడుకుంటున్నాయి. బియాస్ నది గురించి పంజాబ్, హర్యానా, రాజస్థాన్ కొట్లాడుకుంటున్నయ్. ఎందుకీ కొట్లాట దేశంలో నీటి లభ్యతలేకనా అని ప్రశ్నించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రంలో కలెక్టరేట్‌ను ప్రారంభించిన అనంతరం జరిగిన బహిరంగ సభలో కెసిఆర్ పాల్గొని మాట్లాడారు. ఈ పరిస్థితి పోయి దేశాన్ని దార్శనికంగా ముందుకు తీసుకుని వెళ్లే ప్రభుత్వాలు రావాలన్నారు. దేశాన్ని రక్షించుకునేందుకు ఖమ్మం నుంచి శంఖారావాన్ని పూరించనున్నట్లు బీఆర్ఎస్ అధినేత, రాష్ట్ర ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖరావు ప్రకటించారు. 'ఎనిమిది సంవత్సరాల కిందట ఇప్పుడున్న పార్టీ కేంద్రంలో అధికారంలోకి వచ్చింది. మన జీడీపీ 11లక్షల కోట్లకు పెంచుకున్నం. తెలంగాణ పని చేసినట్లు కేంద్రం పనిచేస్తే జీడీపీ 14లక్షల కోట్లు ఉండేది. కానీ, కేంద్రం అసమర్థ విధానాలు, దుర్మార్గపూరితమైన విధానాల వల్ల తెలంగాణ కేంద్రం రూ.3లక్షల కోట్లు నష్టపోయింది. ఒక రాష్ట్రం 3లక్షల కోట్లు నష్టపోతే దేశమంతా ఎంత నష్టపోయి ఉంటుందని ప్రశ్నించారు. ప్రగతిశీల విధానంతో అందరు ప్రజలంతా మావాళ్లే అనుకొని.. అందరినీ కడుపులో పెట్టకొని కాపాడేది గొప్ప పార్టీ, గొప్ప ప్రభుత్వం అవుతుందని కానీ.. ప్రజలను విడదీసి, మతచిచ్చుపెట్టి, కులాల కుంపట్లు పెట్టి, ద్వేషం రగిలిస్తే.. తద్వారా మొలకెత్తే విషవృక్షాలు ఎవరిని దహించి వేస్తాయో ఆలోచించారా అని ప్రశ్నించారు. దేశం అశాంతికి లోనైతే.. మనం తాలిబన్లలాగా తయారైతే.. పెట్టుబడులు వస్తాయా? ఉద్యోగాలు ఉంటయా? ఉన్న పరిశ్రమలు నిలబడి ఉంటాయా? కర్ఫ్యూలు, లాఠీచార్జ్, ఫైరిరగ్‌లాంటి వాతావరణం వస్తే ఎంత భ్రష్టుపట్టి పోతుంది సమాజం గుర్తించారా అని కేంద్రాన్ని నిలదీశారు. దేశాన్ని ఎలాంటి వక్రమార్గంలో పెట్టే దుష్ట పన్నాగాలు, దుర్మార్గ ప్రయత్నాలు జరుగుతున్నాయో గ్రామాల్లో చర్చ పెట్టాలి. కేసీఆర్ చెప్పే మాటలు ఎంతవరకు నిజం అనే మాటను గమనిస్తే దేశానికే ఎంతో మేలు జరుగుతుంది. దేశం మొత్తం బాగుంటేనే మనం బాగుంటాం. దేశపురోభివృద్ధిలోనే మన పురోభివృద్ధి ఉంటుందని

4వ




# కేంద్ర అసమర్థ విధానాలతో అభివృద్ధికి అడ్డంకి



- యువత ఆలోచించి.. సమగ్ర చర్చచేయాలి
- తెలంగాణ ఏర్పడ్డతరవాత ఎంతో ప్రగతి సాధించాం
- మానుకోటకు ప్రభుత్వ ఇంజనీరింగ్ కళాశాల
- జిల్లాలోనిమున్సిపాలిటీలకు నిధులు మంజూరు
- మానుకోట పర్యటనలో సిఎం కెసిఆర్

మహబూబాబాద్, జనవరి 12 (సమసమాజం): కేంద్రం అసమర్థ విధానాలతో ఎంతో నష్టపోతున్నామని సీఎం కేసీఆర్ అన్నారు. కేంద్రం తీరుతో జీఎస్డీపీ వెనుకబడిందన్నారు. ప్రత్యేక తెలంగాణ ఏర్పడ్డతరవాత ఎంతో ప్రగతి సాధిస్తున్నా కేంద్రం తీరు అభివృద్ధికి ఆటంకంగా మారిందని మండిపడ్డారు. ప్రజలు ముఖ్యంగా యువత ఆలోచన చేయాలన్నారు. మనచుట్టూ ఏం జరుగుతుందో గమనించాలన్నారు. మహబూబాబాద్ బహిరంగ సభలో మాట్లాడిన కేసీఆర్.. దేశ అభివృద్ధిపై యువకులు చర్చించాలన్నారు. యువకులు ముందుకు వస్తేనే దేశం బాగుపడుతుందన్నారు. కృష్ణా ట్రిబ్యునల్ ఏర్పాటు చేసి తెలంగాణకు అన్యాయం చేస్తున్నారని వ్యాఖ్యనించారు. 20 ఏండ్లు గడిచినా కృష్ణా ట్రిబ్యునల్ తీర్పులు రావటం లేదని ఆరోపించారు. జిల్లా కేంద్రమైన మానుకోటలో కొత్తగా నిర్మించిన బీఆర్ఎస్ పార్టీ కార్యాలయాన్ని,జిల్లా కలెక్టరేట్‌ను సీఎం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో సీఎం మాట్లాడారు. మహబూబాబాద్ గతంలో చాలా

4వ

# అందరితో మాట్లాడి సమస్య తెలుసుకున్నా

### అసంతృప్తి వీడి పార్టీకోసం అంతా పనిచేయాలి

### కాంగ్రెస్ కొత్త ఇన్‌ఛార్జ్ మాణిక్‌రావ్ ఠాక్రే వెల్లడి




హైదరాబాద్,జనవరి12(సమసమాజం): కాంగ్రెస్ పార్టీ బలోపేతం కోసం నేతలతో మాట్లాడి వారి ఆలోచనలు తెలుసుకున్నానని రాష్ట్ర వ్యవహారాల ఇంఛార్జ్ మానిక్ రావ్ ఠాక్రే అన్నారు. నేతల మధ్య అసంతృప్తి తొలగిపోయిందని చెప్పారు. పార్టీ పటిష్టత కోసం పనిచేస్తామని వారంతా చేతిలో చేయి వేసి చెప్పారని ఠాక్రే వెల్లడించారు. ఏఐసీసీ ఆదేశాలకు అనుగుణంగా హాత్ సే హాత్ జోడో అభియాన్ యాత్ర సాగుతుందని స్పష్టం చేశారు. రాహుల్ గాంధీ భారత్ జోడో యాత్రకు కొనసాగింపుగా రెండు నెలల పాటు ఈ యాత్ర కొనసాగుతుందని స్పష్టం చేశారు. తెలంగాణలో అధికారంలోకి రావడమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ పనిచేయాలని అన్నారు. విభేదాలు పక్కనపెట్టి కలసి సాగాలన్నారు. గాందీభవన్‌లో పార్టీ నేలతో ఆయన సమావేశమయ్యారు. పిసిసి చీఫ్ రేవంత్ రెడ్డి సహా పలువురు నేతలు పాల్గొన్నారు. నియోజకవర్గంలో బిజీగా ఉండటం వల్లే ఎంపీ కోమటిరెడ్డి వెంకటరెడ్డి సమావేశానికి రాలేకపోయారని థాక్రే చెప్పారు. కోమటిరెడ్డికి ఎలాంటి అసంతృప్తి లేదని స్పష్టం చేశారు. గాంధీభవన్‌లో జరిగే తదుపరి సమావేశాలకు ఆయన

4వ

# వివేకానంద స్ఫూర్తితో పనిచేయాలి

### బిజెవైఎం మారథాన్‌లో వివేక్

హైదరాబాద్,జనవరి12(సమసమాజం): స్వామి వివేకానంద స్ఫూర్తితో అందరూ పని చేయాలని.. ఆయన బాటలో నడవాలని బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యులు వివేక్ వెంకటస్వామి పిలుపునిచ్చారు. ఆనాడు వివేకానందుడు చికాగోలో అందరి ముందు ధైర్యంగా మాట్లాడి.. మన దేశానికి మంచి పేరు తెచ్చారని గుర్తు చేశారు. పీఎం మోడీ కూడా వివేకానంద అడుగుజాడల్లో నడవాలని ప్రజలకు పిలుపునిచ్చారని వివేక్ చెప్పారు. ఏదైనా అనుకుంటే ఆ లక్ష్యాన్ని సాధించేవరకు విశ్రమించొద్దని వివేకానంద చెప్పేవారని అన్నారు. రాష్ట్రంలో అవినీతి పెరిగిపోయిందని.. కల్వకుంట్ల కుటుంబాన్ని గద్దె దించేవరకు విశ్రమించొద్దని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో కేసీఆర్ ప్రభుత్వాన్ని పడగొట్టి.. బీజేపీని అధికారంలో నిలబెట్టే బాధ్యతను బీజేపీ,బీజేవైఎం తీసుకోవాలని సూచించారు.. స్వామి వివేకానంద 160వ జయంతి సందర్భంగా సికింద్రాబాద్ మహంకాళి జిల్లా బీజేవైఎం ఆధ్వర్యంలో ఎంగ్ ఇండియా మారథాన్ రన్ చేపట్టారు. రాణిగంజ్ నుంచి వివేకనంద విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యులు వివేక్ వెంకటస్వామి పలువురు బీజేపీ నాయకులతో కలిసి ఈ రన్ లో పాల్గొన్నారు.

# గ్రూప్1 ఫలితాల వెల్లడికి టీఎస్‌పీఎస్‌సీ కసరత్తు

హైదరాబాద్,జనవరి12(సమసమాజం): తెలంగాణలో గ్రూప్1 ప్రిలిమ్స్ ఫలితాల వెల్లడించేందుకు టీఎస్‌పీఎస్‌సీ కసరత్తు చేస్తోంది. సంక్రాంతి ముందే ఈ ఫలితాలను వెల్లడించేందుకు అధికారుల అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. గ్రూప్1 ప్రిలిమ్స్ పరీక్షల ఫలితాలు వెల్లడికి కమిషన్‌కు హైకోర్టు అనుమతి ఇచ్చింది. స్థానికత వివాదంపై కోర్టు ఆదేశాలను అధికారులు పరిశీలిస్తున్నారు. కోర్టు ఆదేశాలు,గ్రూప్1 ఫలితాల విడుదలపై అధికారుల సమావేశమై నిర్ణయం తీసుకోనున్నారు.. ఓ అభ్యర్థి స్థానికత వివాదం నేపథ్యంలో ఞాఖాఅ అప్పీలుపై జనవరి నిన్న హైకోర్టులో విచారణ జరిగింది. అభ్యర్థి స్థానికత వివాదంపై కౌంటర్ దాఖలు చేయాలని కమిషన్‌కు ఆదేశించింది. అభ్యర్థి స్థానికత వివాదం తర్వాత తేలుస్తామన్న హైకోర్టు.. ఫలితాలు వెల్లడించవచ్చని స్పష్టం చేసింది. కాగా.. 503 గ్రూప్1 సర్వీసుల పోస్టులకు అక్టోబరు 16న నిర్వహించిన ప్రిలిమినరీ పరీక్షకు 2,85,916 మంది హాజరయ్యారు. అక్టోబరు 29న ప్రాథమిక కీ ప్రకటించిన విషయం తెలిసిందే.

# ఖమ్మం వేదికగా 18న కంటివెలుగు

### కెసిఆర్ చేతులమీదుగా ప్రారంభం ● అధికారులతో సమీక్షించి ఆదేశాలు ఇచ్చిన హరీష్ రావు

ఖమ్మం,జనవరి12(సమసమాజం): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కంటి వెలుగు కార్యక్రమం ఈ నెల 18న ఖమ్మం వేదికగా సీఎం కేసీఆర్ ప్రారంభిస్తారని రాష్ట్ర ఆర్థిక, వైద్యారోగ్య మంత్రి హరీష్ రావు ప్రకటించారు. దీనికి సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్, వైద్యాధికారులను ఆదేశించారు. సీఎం కేసీఆర్ కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రారంభించిన వెంటనే అన్ని జిల్లాల్లో కంటి పరీక్షలు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. 18న మధ్యాహ్నం ఒంటి గంటకు కంటి వెలుగు కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి కేసీఆర్ ఖమ్మం జిల్లా నుంచి ప్రారంభించనున్నారని మంత్రి హరీశ్ రావు వెల్లడించారు. కంటి వెలుగు కార్యక్రమానికి జిల్లా అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని ఆదేశాలు జారీ చేశారు. గురువారం ఖమ్మం జిల్లా కేంద్రం నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లు, డీఎంహెచ్‌వోలతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్సు ద్వారా అధికారులకు పలు సూచనలు చేశారు.ప్రజా ప్రతినిధులు, జిల్లా స్థాయి అధికారులు వివిధ ప్రాంతాల్లో ప్రారంభించే కంటి వెలుగు కార్యక్రమాల్లో పాల్గొనేలా ముందస్తు కార్యచరణ రూపొందించుకోవాలని హరీష్ రావు చెప్పారు. కేసీఆర్ పర్యటనకు



ఒకరోజు ముందే అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వద్దకు కంటి పరీక్షలు నిర్వహించే మిషన్లు, కళ్లద్దాలు, మందుల పంపిణీ జరగాలని హరీష్ రావు స్పష్టం చేశారు. ఈ పక్రియలో ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా వెంటనే కుటుంబ సంక్షేమ విభాగానికి రిపోర్టు చేయాలని చెప్పారు. జిల్లాస్థాయి అధికారులతో కూడిన వాట్సాప్ గ్రూపులు ఏర్పాటు చేసుకొని సమన్వయం చేసుకోవాలని సూచించారు. ప్రజలకు అవగాహన కల్పించేలా గ్రామాలు, పట్టణాల్లో ప్లెక్సీలు, బోర్డులు ఏర్పాటు చేయాలని, స్క్రీనింగ్ లో ఎలాంటి సాంకేతిక సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని చెప్పారు. కంటి వెలుగును సీఎం కేసీఆర్ ప్రారంభించిన వెంటనే అన్ని జిల్లాల్లో కంటి పరీక్షలు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలన్నారు.

# కెసిఆర్ పాలన అద్భుతం

- మానుకోటకు నీళ్లు పారించిన భగీరథుడు
- ఒకప్పటి మానుకోటకు..నేటి మానుకోటకు ఎంతో తేడా
- కెసిఆర్ సభలో మంత్రిఎర్రబెల్లి ప్రశంసలు
- కలెక్టరేట్ నిర్మాణం అద్భుతమన్న సిఎస్ శాంతికుమారి




మహబూబాబాద్,జనవరి12(సమసమాజం): జిల్లాకు సీఎం కేసీఆర్ వస్తే కన్న తల్లిదండ్రులు వచ్చినట్లు అనిపిస్తుందని మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు అన్నారు. ఎడారి లాంటి ప్రాంతాల్లో నీరు పారిస్తున్న భగీరథుడు కేసీఆర్ అని సీఎంపై ప్రశంసలు కురింపించారు. ఒకప్పుడు తండాలు, గ్రామాల్లో బిందెలు నెత్తి మీద పెట్టుకుని నీళ్లు మోసుకునే వాళ్లమని.. ఇప్పుడు బిందెలతో క్యూలు కట్టే రోజులు పోయాయని అన్నారు. కేసీఆర్ నిర్ణయం వల్ల ప్రస్తుతం ప్రతి ఇంట్లో నల్లా కనెక్షన్లు ఉన్నాయని చెప్పారు. తండాల అభివృద్ధి కోసం వాటిని గ్రామ పంచాయితీలుగా మార్చారని చెప్పారు. 40 ఏళు ్లగా తాను మహబూబాబాద్ లోనే ఉన్నానని.. అప్పట్లో వ్యవసాయం చేసినప్పుడు నీళ్లు ఉండేవి కాదని ఎర్రబెల్లి చెప్పారు. ఎడారిలాంటి ప్రాంతాల్లో.. కేసీఆర్ దయవల్ల ఎండాకాలంలో కూడా చెరువుల్లో నీళ్లు పారుతున్నాయని అన్నారు. మిషన్ భగీరథ ద్వారా గోదావరి, కృష్ణా జలాలను ఫిల్టర్ చేసి జనం దాహార్తిని తీరుస్తున్నారని చెప్పారు. మహబూబాబాద్ సభలో మంత్రిఎర్రబెల్లి మాట్లాడారు. అంతకుముందు సీఎం కేసీఆర్ హయాంలో రాష్ట్రం ప్రగతిపథంలో దూసుకుపోతోందని కొత్త సీఎస్

4వ

# పంతంగి టోల్‌ప్లాజా వద్ద వాహనరద్దీ

### భారీగా బారులుతీరిన వాహనాలు



చౌటుప్పల్,జనవరి12(సమసమాజం): విద్యాసంస్థలకు సంక్రాతి సెలవులు ప్రారంభం కావడంతో సంక్రాంతికి పట్టణ ప్రజలు పల్లెబాట పట్టారు. పిల్లాపాపలతో నగరవాసులు ఊర్లకు బయలుదేశారు. దీంతో హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిపై వాహనాల రద్దీ అధికమైంది. ఈనేపథ్యంలో చౌటుప్పల్ మండలంలోని పంతంగి టోల్‌ప్లాజా వద్ద వాహనాలు బారులు తీరాయి. అయితే టోల్‌గేట్ల వద్ద ట్రాఫిక్ జామ్ కాకుండా అధికారులు ముందుగానే చర్యలు తీసుకున్నారు. టోల్ బూత్‌లలో రెండు సెకన్లకే వాహనాలు వెళ్లేందుకు ఏర్పాట్లు చేయడంతో వాహనాలు తొందరగా వెళ్తున్నాయి. జాతీయ రహదారిపై యాక్సిడెంట్ జోన్, బ్లాక్ స్పాట్‌ల వద్ద అధికారులు బారికేడ్లు ఏర్పాటు చేశారు. 24 గంటలపాటు హైవేపై గస్తీ నిర్వహించేందుకు ప్రత్యేక బృందాలను సిద్ధం చేశారు. పంతంగితోపాటు కొర్లపాడ్, చిల్లకల్లు టోల్‌ప్లాజాల వద్ద పటిష్ట చర్యలు చేపట్టారు.

# అట్టహాసంగా సంక్రాంతి సంబరాలు

- తిరుపతిలో రంగవల్లుల పోటీలు
- కత్తులు కట్టకుండా కోడి పందాలు
- ఎస్పీ, మంత్రిరోజా సమక్షంలో సరదా పోటీలు

తిరుపతి,జనవరి12(సమసమాజం): పట్టణ ప్రజలు పల్లె బాట పట్టారు. తెలుగు లోగిళ్ళలో సంక్రాంతి సంబరాల

4వ

# కేంద్ర అసమర్థ విధానాలతో అభివృద్ధికి అడ్డంకి

(మొదటి పేజీ తరువాయి) వెనుకబడ్డ ప్రాంతం అని, ఇప్పుడు జిల్లా అయ్యాక అభివృద్ధి పరుగులు పెడుతోందన్నారు. ఈ సందర్భంగా కేసీఆర్ కీలక ప్రకటన చేశారు. జిల్లాకు కొత్తగా ఇంజినీరింగ్ కాలేజ్ ఏర్పాటు చేస్తామని హామీఇచ్చారు. వచ్చే విద్యా సంవత్సరం నుండే అందుబాటులోకి తెచ్చేలా చూస్తామన్నారు. తెలంగాణ వచ్చాకా చాలా పనులు చేసుకున్నాం. చాలా జిల్లాల్లో కొత్త కలెక్టరేట్లు కట్టుకున్నాం. ఇప్పుడు మహబూబాబాద్ జిల్లా కలెక్టర్ కార్యాలయం ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. ఈ కలెక్టరేట్ ప్రజాసమస్యలు తీర్చే కార్యాలయంగా మారాలి. తెలంగాణ రాకముందు 3, 4 వైద్య కళాశాలలు ఉండేవి. రాష్ట్రం ఏర్పడ్డాక అనేక కొత్త వైద్య కళాశాలలను తెచ్చుకున్నాం. మహబూబాబాద్‌కు ప్రభుత్వ ఇంజినీరింగ్ కాలేజ్ మంజూరు చేస్తున్నాం. వచ్చే విద్యా సంవత్సరం నుండే అందుబాటులోకి తెచ్చేలా చూస్తాం' అని సీఎం పేర్కొన్నారు. మహబూబాబాద్ జిల్లాలోని అనేక తండాలను గ్రామ పంచాయతీలుగా మార్చినట్లు సీఎం చెప్పారు. ప్రతీ గ్రామ పంచాయతీకి రూ.10 లక్షలు మంజూరు చేస్తున్నట్లు ఈ సందర్భంగా ప్రకటించారు. దీంతో పాటు మహబూబాబాద్ పట్టణానికి రూ.50 కోట్లు, తొర్రూరు, మరిపెడ, డోర్నకల్‌కు రూ.25 కోట్లు చొప్పున సీఎం ప్రత్యేక నిధి నుండి మంజూరు చేస్తున్నట్టు ప్రకటించారు. మంజూరు చేసిన నిధుల్లోని ప్రతి రూపాయి ప్రజలకు ఉపయోగపడేలా వినియోగించాలని స్థానిక మంత్రి, ఎమ్మెల్యేలకు సీఎం సూచించారు. కలెక్టర్ కూడా శ్రద్ధ పెట్టి నిధులను సక్రమంగా వినియోగించాలన్నారు. తెలంగాణ ఉద్యమ సమయంలో మహబూబాబాద్ ప్రాంతానికి వచ్చా. అప్పుడు ఇక్కడ చాలా దారుణమైన కరువు పరిస్థితులు ఉండేవి. కండ్లకు నీళ్లు పెట్టుకుని ఏడ్చిన. పక్కన కృష్ణమ్మ ఉన్నా.. ఫలితమేమీ లేకపాయె. తుంగతుర్తి, వర్ధన్నపేట, పాలకుర్తి ప్రాంతాలు తిరిగినప్పుడు అక్కడ సగం గీకిన కాలువలు చూసి ఈ జన్మలో నీళ్లు రావు అని చాలా బాధపడ్డా. ఏటూరునాగారం వచ్చినప్పుడల్లా.. చిల్లర డబ్బులు వేసి తల్లీ గోదావరి మా నేలమీదకు ఎప్పుడొస్తావు, మా కరువు ఎప్పుడు తీరుస్తావు అంటూ దండం పెట్టుకునేవాడిని. తెలంగాణ వస్తే బంగారు మీసాలు చేయిస్తా అని ఐనవోలు స్వామికి మొక్కుకున్నా. స్వామి దయ, మీరు చేసిన ఉద్యమం, మానుకోట రాళ్ల బలం అన్నీ కలిసి ఇప్పుడు అద్భుత రాష్ట్రం సాకారమైందని సీఎం కెసిఆర్ సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మంత్రులు ఎర్రబెల్లి దయాకర్ రావు, సత్యవతి రాథోడ్, వేముల ప్రశాంత రెడ్డి, ఎంపీ మాలోత్ కవిత,పల్లా రాజేశ్వర్ రెడ్డి, కడియం శ్రీహరి జిల్లా ఎమ్మెల్యేలు పాల్గొన్నారు. మరో వైపు సీఎం పర్యటన నేపథ్యంలో జిల్లాలో ప్రతిపక్ష నేతలను రాత్రి నుంచి ముందస్తు అరెస్ట్ చేశారు.

# అందరితో మాట్లాడి సమస్య తెలుసుకున్నా

(మొదటి పేజీ తరువాయి) హాజరవుతారని వెల్లడించారు. ఎవరూ బాధపడాల్సిన అవసరం లేదని.. కాంగ్రెస్ నాయకులంతా కలిసి పని చేసేందుకు సిద్ధంగా ఉన్నారని మానిక్ రావు ఠాక్రే వెల్లడించారు. థాక్రే కాంగ్రెస్‌లో సీనియర్ లీడర్ అని, ఆయనఅనుభవం దృష్ట్యా తెలంగాణలో పార్టీని ముందుకు తీసుకెళ్లే లక్ష్యంతో కాంగ్రెస్ అధిష్టానం ఇక్కడికి పంపిందని రేవంత్ రెడ్డి అన్నారు. అందరితో మాట్లాడారని అన్నారు. అందరూ కలసి ముందుకు సాగుతామని, కెసిఆర్ కుటుంబ పాలనపై పోరాడుతామని అన్నారు.

# ఖమ్మం వేదికగా 18న కంటివెలుగు

(మొదటి పేజీ తరువాయి) శుక్రవారం సాయంత్రానికి కంటి పరీక్ష పరికరాలు, కళ్లద్దాలు పీహెచ్‌సీలకు చేరాలని ఆదేశించారు. జిల్లా స్థాయిలో వాట్సప్ గ్రూపులు ఏర్పాటు చేసుకొని సమన్వయం చేసుకోవాలని సూచించారు.స్థానిక ప్రజాప్రతినిధుల సహకారంతో ముందుకు వెళ్లాలని పేర్కొన్నారు.పరీక్ష బృందాలకు అవసరమైన సౌకర్యాలు స్థానికంగా కల్పించాలని వివరించారు. ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా వెంటనే కుటుంబ సంక్షేమ విభాగం కమిషనర్ శ్వేత మహంతికి రిపోర్టు చేయాలని స్పష్టం చేశారు. బృందాలు ఉదయం 9 గంటలకు, సాయంత్రం 4 గంటలకు ఒకసారి వాట్సప్ లో అప్డేట్ చేయాల్సి ఉంటుందన్నారు. ప్రజలకు అవగాహన కల్పించేలా గ్రామాలు, పట్టణాల్లో ప్రచార కార్యక్రమాలు, ప్రజలకు అర్థమయ్యేలా ప్లెక్సీలు, బోర్డులు ఎక్కడికక్కడా ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ప్రత్యేకంగా రూపొందించిన సాఫ్ట్ వేర్ ద్వారా స్క్రీనింగ్ నిర్వహణ ఉంటున్నందున సాంకేతిక సమస్యలు లేకుండా చూసుకోవాలన్నారు. విడతల వారీగా 16,533 లొకేషన్స్‌లో క్యాంపులు నిర్వహణ చేస్తున్నట్లు తెలిపారు. ప్రాథమికంగా 30లక్షల రీడింగ్ గ్లాస్, 25 లక్షల ప్రిస్క్రిప్షన్ గ్లాసెస్ అవసరమైన వారికి ఉచితంగా అందించాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. అధికారులు ప్రతిరోజూ క్యాంపులు సందర్శించాలన్నారు. హెల్త్ సెక్రెటరీ రిజ్వీ, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ శ్వేత మహంతి, డీఎంఇ రమేశ్ రెడ్డి, డీపీహెచ్ శ్రీనివాస రావు, టీఎస్ఎంఎస్ఐడీసీ ఎండీ చంద్రశేఖర్ రెడ్డి, కలెక్టర్లు, వైద్యాధికారులు పాల్గొన్నారు.


# కెసిఆర్ పాలన అద్భుతం

(మొదటి పేజీ తరువాయి)శాంతి కుమారి అన్నారు. మహబూబాబాద్ కలెక్టరేట్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న ఆమె తొలి ప్రసంగంలో ముఖ్యమంత్రిపై ప్రశంసల జల్లు కురిపించారు. గతంలో ప్రభుత్వ ఆఫీసులకు వస్తే జనం కూర్చునేందుకు కూడా అవస్థలు పడేవారని, కానీ ఇప్పుడు పరిస్థితి మారిపోయిందని అన్నారు. కొత్త కలెక్టరేట్ బిల్డింగులు చూస్తే ఇంటిగ్రేటెడ్ కాంప్లెక్సా లేక ఇంద్రభవనమా అన్న అనుమానం కలుగుతోందని చెప్పారు. ఇలాంటి భవనాలు అందుబాటులోకి తెచ్చిన కేసీఆర్‌కు శాంతికుమారి కృతజ్ఞతలు చెప్పారు. రాష్ట్రం ఏర్పడే నాటికి ప్రభుత్వ ఆదాయం రూ.63వేల కోట్లుగా మాత్రమే ఉండేదని, ఇప్పుడు అది 3 రెట్లు పెరిగి లక్షా 80 కోట్లకు చేరిందని శాంతి కుమారి చెప్పారు. ముఖ్యమంత్రి ఆ నిధులతో ప్రపంచం ఆశ్చర్యపోయే గొప్ప కార్యక్రమాలు చేపట్టారని అన్నారు. పాలనా సంస్కరణలతో 33 కొత్త జిల్లాలు ఏర్పాటు చేయడంతో పాటు ఉద్యోగులకు సకల వసతులు కల్పించారని ప్రశంసించారు. ప్రజారంజక పాలన అందిస్తున్న కేసీఆర్ భవిష్యత్తులోనూ వాటిని కొనసాగించాలని ఆకాంక్షించారు. అధికార యంత్రాంగం అంతా చిత్తశుద్ధితో పని చేసే ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్తామని హామీ ఇచ్చారు.

# ఖమ్మం నుంచి యుద్ధ భేరి



(మొదటి పేజీ తరువాయి) అన్నారు. వాస్తవం చెప్పాలంటే.. ఈ రోజు ప్రపంచంలోనే అత్యధికంగా వ్యవసాయ అనుకూలమైన భూమి కలిగి ఉన్నది ఒకేఒక దేశం భారతదేశం. అమెరికాలో వ్యవసాయ అనుకూల భూమి 29శాతమే. చైనాలో వ్యవసాయ అనుకూల భూమి16శాతమే. భారతదేశ భూభాగాన్ని ఎకరాల్లో కొలిస్తే.. 83కోట్ల ఎకరాలు. ఇందులో సరాసరి 41కోట్ల ఎకరాలు అద్భుతమైన పంట పండే భూములున్నాయి. మూడు రకాల ఆగ్రో వాతావరణ పరిస్థితులు మనకు ఉన్నాయి. సూర్యకాంతి పడే అద్భుతమైన దేశం మనది. దేశంలో 1.40లక్షల టీఎంసీల వర్షం కురుస్తుంది. ఇందులో 70వేల టీఎంసీలు ఆవిరైపోతే.. 70వేల టీఎంసీలు కృష్ణా, గోదావరి, గంగా, నర్మదలా లాంటి నదుల్లో ప్రవహిస్తుంది. ఇందులో దేశం వాడుతున్నది కేవలం 20వేల టీఎంసీలే. మిగిలిన 50వేల టీఎంసీలు సముద్రం పాలవుతున్నయ్. మరెందుకు నీటి యుద్ధాలు జరుగుతున్నయ్? దుర్మార్గమైన కేంద్ర



ప్రభుత్వ విధానాల వల్ల, పలికిమాలిన చెత్తతో కూడిన వాటర్ పాలసీలతో రాష్ట్రాలకు రాష్ట్రాలకు జుట్లు ముడేసి తగువులు పెట్టి.. ఢిల్లీ పెద్దలు అనాటి నుంచి ఇదే పద్ధతిలో ప్రేక్షకపాత్ర వహిస్తున్నారని కేసీఆర్ మండిపడ్డారు. రాష్ట్రంలో కృష్ణా జలాల వివాదాన్ని పరిష్కరించిం చేందుకు ట్రిబ్యునల్ వేసినా ఇప్పటి వరకు అతీగతి లేదని అన్నారు. 20 ఏళ్లుగా వాదనలే జరుగకపోతే.. తీర్పులు ఎప్పుడు రావాలి కేటాయింపులు ఎప్పుడు జరిగాలి? డిజైన్లు ఎన్నడు కావాలి? అనుమతులు ఎప్పుడు రావాలి ప్రాజెక్టుల నిర్మాణం ఎన్నుడు పూర్తి కావాలి? నీళ్లు ఎన్నడు



రావాలి? ఇదేనా భారతదేశం 50వేల టీఎంసీల నీరు సముద్రం పాలైతే దేశంలో మంచినీళ్లకు గతి ఉండదా 75 సంవత్సరాల స్వతంత్ర భారతంలో మంచినీళ్లు ఇచ్చే శక్తి లేకుండా పోయిందా? దేశానికి. దీనికి కారణం దుర్మార్గ పూరితమైన చేతగాని దద్దమ్మల నీటి పాలసీలు కారణం' అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్రం అనుసరిస్తున్న విధానాలపై మండిపడ్డారు. కేంద్ర ప్రభుత్వ వాటర్ పాలసీతో రాష్ట్రాలు జట్లు పట్టుకుంటున్నాయని కెసిఆర్ విమర్శించారు. 'చేబితే ప్రపంచముందు సిగ్గుపోతుంది. ÷లిశ రాజధాని ఢిల్లీలో మంచినీళ్లు రావు. కరెంటు రాదు. ఉపన్యాసాలు వింటే టీవీలు బద్దలైతయ్. రైతులు, విద్యార్థులు, యువకులు, విద్యావేత్తలు ఆలోచించాలి. దేశంలో స్థాపిత 4.10లక్షల మెగావాట్ల విద్యుత్ ఉంది. దేశ ఏ ఒక్క రోజు 2.10లక్షల మెగావాట్లకు మించి వాడలేదు. తెలంగాణలో తప్పా భారతదేశంలో ఏయే రాష్ట్రంలో, ప్రధాని సొంత రాష్ట్రం సహా 24 గంటల కరెంటు ఇచ్చే పరిస్థితి లేదు. మంచినీరు ఇవ్వరు.. సాగునీరివ్వరు.. కరెంటు ఇవ్వరు.. ఉద్యోగాలు ఇవ్వరు.. ఉపన్యాసాలు వినాలా? ఎన్ని రోజులు




వినాలి?' అని నిలదీశారు. దేశంలో ఆలోచనా సరళి మారాలని సీఎం కేసీఆర్ అన్నారు. 'ఎన్నికల్లో పార్టీలు, నాయకులు గెలుస్తున్నారు. ఎన్నికల్లో ప్రజలు గెలవాలి. ప్రజల అభిప్రాయం గెలవాలి. ఎన్నికల తదనంతరం ప్రజలకు ఇచ్చిన వాగ్దానం తూ.చా.తప్పకుండా నెరవేర్చాలి. లేకపోతే నిలబెట్టి నిలదీసే పరిపూర్ణమైన ప్రజాస్వామ్య పక్రియ రానంత వరకు ఈ దేశంలో ఇవే ఉపన్యాసాలు, సొల్లు పురాణాలు,



కాలక్షేపాలు చూస్తాం తప్ప న్యాయం జరుగదు. రాబోయే రోజుల్లో దేశాన్ని రక్షించుకునేందుకు, తెలంగాణ పోరాట పంథా, పౌరుషం ఉన్న గడ్డ కాబట్టి ఇక్కడి నుంచి విజ్ఞాన వీచికలు ప్రసారం కావాలి. అందులో భాగంగానే చాలామంది ముఖ్యమంత్రులు, పెద్దలు ఖమ్మానికి రాబోతున్నరు. ప్రజలంతా వచ్చిన పాల్గొనాలి. దేశాన్ని రక్షించు కునేందుకు అందరూ నడుం కట్టాలి. మేం బాగున్నం కాదా..? పొరుగింటోళ్లు ఏమైతే ఏంటీ అనుకుంటే.. ఒక రోజు మనకు ఇబ్బంది వస్తుంది. మీ అందరి దీవెనతో తెలంగాణలో రాష్ట్రంలో మౌలిక వసతులు, ప్రజా సంక్షేమం కానీ, కులమత, వర్ణవర్గ రహితంగా కడుపులో పెట్టుకొని ముందుకుపోతున్నమో.. అదే పద్ధతిలో ముందుకు పోదాం.. అందరినీ కడుపులో పెట్టుకొని చూసుకుందాం' అన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రిపువ్వాడ నాగేశ్వరరావు,మాజీమంత్రి తుమ్మల తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణను తాకట్టు పెట్టిన కెసిఆర్

## మరోమారు విమర్శలు గుప్పించిన షర్మిల



హైదరాబాద్,జనవరి12(సమసమాజం): సీఎం కేసీఆర్ తన స్వార్థ రాజకీయాలకు రాష్ట్ర ప్రయోజనాలను తాకట్టుపెట్టి తెలంగాణను నిలువునా ముంచాడని వైఎస్ఆర్ టీపీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల అన్నారు. ఎంతో మంది ప్రాణాలను సైతం లెక్కచేయకుండా రక్తం చిందించి పోరాడి సాధించుకున్న తెలంగాణకు నీళ్ళు, నిధులు, నియామకాల్లో అన్యాయం జరుగుతోందని చెప్పారు. రాష్ట్రం ఏర్పడి ఎనిమిదేండ్లు గడుస్తున్నా.. విభజన హామీల ఊసెత్తడం లేదన్నారు. నీటి వాటాపై మాట్లాడడం లేదని మండిపడ్డారు. కేసీఆర్ చేసింది దొంగ దీక్ష కాబట్టే నోరు విప్పడం లేదా? అని ప్రశ్నించారు. తెలంగాణ ప్రజల పోరాటాన్ని ఆసరాగా చేసుకొని ముఖ్యమంత్రి పీఠం ఎక్కిన సీఎం కేసీఆర్ ..అందిన కాడికి రాష్ట్రాన్ని దోచుకున్నారని షర్మిల ఆరోపించారు. తెలంగాణను అడుగడుగునా కొల్లగొట్టారని మండిపడ్డారు. ఇన్నాళ్లు బీజేపీకి వంత పాడిన కేసీఆర్.. తెలంగాణ సంపదను దోచుకున్నాడని....ఇప్పుడు అదే బీజేపీని తిట్టినట్లు చేసి.. దేశాన్ని కూడా దోచుకుందామని కుట్ర చేస్తున్నారని తెలిపారు. స్వార్థ రాజకీయాలకు తెలంగాణ ప్రజలు బలి అవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బిజెపి, బిఆర్ఎస్ ముక్త్ భారత్ కావాలి, కెసిఆర్ ముక్త్ తెలంగాణ కావాలని షర్మిల పిలుపునిచ్చారు.

# శ్రీశైలం భక్తులకు ఆర్టీసీ దర్శన భాగ్యం

## బస్సుల్లో వెళ్లేవారికి దర్శన టిక్కెట్ల సౌలభ్యం

అమరావతి,జనవరి12(సమసమాజం): శ్రీశైలంలోని మల్లిఖార్జున స్వామిని దర్శించుకునేందుకు వెళ్లే యాత్రికులకు ఏపీ ఆర్టీసీ శుభవార్త తెలియజేసింది. శ్రీశైలం వెళ్లే యాత్రికులు బస్సు టికెట్ రిజర్వేషన్ చేసుకుంటే స్పర్శదర్శన టికెట్లనూ అందుబాటులోకి తీసుకురానున్నామని ఏపీ ఆర్టీసీ ఎండీ సీహెచ్ ద్వారకా తిరుమలరావు తెలిపారు. బస్సుల్లో తిరుపతి వెళ్లే భక్తులకు శ్రీవారి శీఘ్రదర్శన టికెట్లు అందుబాటులో ఉన్న విధంగానే శ్రీశైలం విషయంలోనూ అమలు చేసేందుకు సంస్థ చర్యలు తీసుకుంటుందని చెప్పారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆర్జిత, పరోక్ష సేవలను ఆలయ అధికారులు నిలిపివేశారు.

# శ్రీశైలంలో సంక్రాంతి ఉత్సవాలు

## అంకురార్పణతో ప్రారంభం



నంద్యాల,జనవరి12(సమసమాజం): శ్రీశైల మహాక్షేత్రంలో మకర సంక్రాంతి బ్రహ్మోత్సవాలు గురువారం ఉదయం యాగశాల ప్రవేశంతో ప్రారంభమయ్యాయి. సాయంకాలం 5.30 గంటల నుంచి అంకురారోహణ, అగ్ని ప్రతిష్ఠాపన, 7 గంటలకు ధ్వజారోహణ కార్యక్రమాలు చేపట్టారు. ఈ నెల 18 వరకు బ్రహ్మోత్సవాల్లో భ్రమరాంబ మల్లికార్జున స్వామి ప్రతిరోజూ విశేష పూజలు అందుకోనున్నారు. యాగశాల ప్రవేశం, వేదస్వస్తి, శివసంకల్పం, గణపతిపూజ, పుణ్యాహ వాచనం, చండీశ్వరపూజ, వాస్తుహోమం, మండపారాధనలు, రుద్రకళశ స్థాపన, వేదపారాయణాలతో పాటు ప్రత్యేక పూజాధికాలు చేయనున్నారు. ఉత్సవాల నేపథ్యంలో శ్రీశైల మహాక్షేత్రాన్ని రంగు రంగుల విద్యుద్దీపాలతో అలంకరించారు. బ్రహ్మోత్సవాల నేపథ్యంలో ఆర్జిత సేవలను నిలిపివేస్తున్నట్టు ఆలయ ఈవో తెలిపారు. నెల 13 నుంచి 18 వ తేదీ వరకు భ్రమరాంబ మల్లికార్జునస్వామి అమ్మవార్లకు వాహన సేవలు నిర్వహిస్తారు. 13న భృంగి, 14న రావణ, 15న నంది.16న కైలాస, 18న అశ్వ వాహన సేవలుంటాయి. ఈనెల 14న భోగిరోజు ఉదయం 10 గంటలకు ఆలయ ప్రాంగణంలోని అక్కమహాదేవి అలంకార మండపంలో ఉచిత సామూహిక బోగిపండ్ల కార్యక్రమం. 15న ఉదయం ఆలయ దక్షిణ మాడవీధిలో మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహిస్తారు. 17న ఉదయం యాగ పూర్ణాహుతి, కలశోద్వాసన, త్రిశూల స్నానం, సాయంత్రం సదస్యం, నాగవల్లి, ధ్వజావరోహణ 17న వేద శ్రవణం, 18న రాత్రి పుష్పోత్సవం, శయనోత్సవం, ఏకాంత సేవలతో బ్రహ్మోత్సవాలు ముగియనున్నాయి.

# తిరుమలలో కొనసాగుతున్న రద్దీ

## నేడు డయల్ యువర్ ఇవో



తిరుమల,జనవరి12(సమసమాజం): తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా కొనసాగుతుంది. శ్రీ వేంకటేశ్వర స్వామివారిని దర్శించుకునేందుకు వివిధ ప్రాంతాల నుంచి భక్తుల రాకతో ఏడు కంపార్టుమెంట్లు నిండిపోయాయి. వీరికి సర్వదర్శనానికి 24 గంటల సమయం పడుతుందని టీటీడీ అధికారులు తెలిపారు. బుధవారం స్వామివారిని 68,850 మంది భక్తులు దర్శించుకోగా 21,280 మంది తలనీలాలు సమర్పించుకున్నారు. భక్తులు సమర్పించుకున్న కానుకల ద్వారా హుండీ ఆదాయం రూ. 3.61 కోట్లు వచ్చిందని వెల్లడించారు. డయల్ యువర్ టీటీడీ ఈవో కార్యక్రమం శుక్రవారం ఉదయం 9 నుంచి 10 గంటల వరకు తిరుమల అన్నమయ్య భవనంలో జరుగనుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొనే భక్తులు తమ సందేహాలను, సూచనలను టీటీడీ ఈవో ఎవి.ధర్మారెడ్డికి ఫోన్ నెంబరు 0877-2263261 ద్వారా నేరుగా మాట్లాడి తెలుపవచ్చని సూచించారు.

# అట్టహాసంగా సంక్రాంతి సంబరాలు

(మొదటి పేజీ తరువాయి) సందడి మొదలైంది. సామాన్యులు, సెలబ్రెటీలు, ప్రజాప్రతినిధులు ఇలా ప్రతి ఒక్కరు సంక్రాంతి పండుగ కోసం రెడీ అవుతున్నారు. మరోవైపు ఆంధ్రప్రదేశ్ లో వివిధ ప్రాంతాల్లో ముందుగా సంక్రాంతి సంబరాలను ప్రభుత్వ అధికారులు, పోలీసులు నిర్వహిస్తున్నారు. తిరుపతి పోలీస్ పెరేడ్ గ్రౌండ్ లో సంక్రాంతి సంబరాలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. రంగులరంగుల రంగవల్లుల పోటీలు, గంగిరెద్దుల ఆటలు వేడుకలను నిర్వహించారు. సాంస్కృతిక సంప్రదాయాలను అనుసరిస్తూ నిర్వహించిన ఈ సంక్రాంతి వేడుకలకు ముఖ్య అతిథిగా పర్యటక మంత్రి ఆర్కే రోజా హాజరయ్యారు. ముగ్గులు పెట్టారు. అంతేకాదు.. కోడిపందాలకు ఒక వైపు నిషేధమంటూనే మరోవైపు ఆటవిడుపుగా కోళ్ల పోటీలు పెట్టారు. కోళ్లకు కత్తులు కట్టకుండానే కోళ్లను రంగంలో దింపి తిరుపతి పోలీసులు సంబరాలు నిర్వహించారు. తిరుపతి ఎస్పీ పరమేశ్వర్ రెడ్డి, రాష్ట్ర మంత్రి ఆర్కే రోజా కోళ్లను పట్టుకుని పోటీకి వదలారు. పోటీలను వీక్షిస్తూ వినోదం పంచుకున్నారు పోలీసులు. తమ పరిధిలో కోడి పందాలు జల్లికట్టు నిర్వహణకు అనుమతులు లేవని డీఐజీ స్పష్టం చేశారు. అంతేకాదు పోటీలు జరిగే ప్రాంతాల్లో ఇప్పటికే నిఘా పెట్టామని , పోలీస్ పికెట్లు ఏర్పాటు చేశామని తెలిపారు. నిషేధాజ్ఞలు కాదని.. కోడిపందాలు జల్లికట్టు నిర్వహిస్తే కేసులు నమోదు చేస్తామని వార్నింగ్ ఇచ్చారు. అయితే ఇప్పుడు పోలీస్ పరేడ్ గ్రౌండ్ లో కోడి పందాలను సంప్రదాయ క్రీడగా పోలీసులే నిర్వహించడం పై సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రస్తుతం ఏది నేరం ఏది వినోదమన్న విషయంపై చర్చ జరుగుతుంది.

# జార్ఖండ్‌లో ఘోరరోడ్డు ప్రమాదం

## కూలీలతో వెళ్తున్న వ్యాన్ బోల్తా ● ఏడురుగు కూలీలు దుర్మరణం

రాంచి,జనవరి12(సమసమాజం): జార్ఖండ్‌లోని సెరైకెలా-ఖర్సావాన్ జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. కూలీలతో వెళ్తున్న పికప్ వ్యాన్ ఒకటి బోల్తా పడటంతో ఏడుగురు కూలీలు దుర్మరణం పాలయ్యారు. మరో 8 మంది తీవ్రంగా గాయపడ్డారు. వీరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తున్నది. కూలీలను తీసుకెళ్తుండగా ఈ ప్రమాదం జరిగినట్లు స్థానికులు చెప్తున్నాను. ఈ ఘటన గురువారం ఉదయం జార్ఖండ్‌లోని రాజ్‌నగర్ పీఎస్ పరిధిలోని ఖైర్బానీ గ్రామ సమీపంలో జరిగింది. స్థానికుల సమాచారం మేరకు సంఘటనాస్థలానికి చేరుకున్న పోలీసులు క్షతగాత్రులను సమీపంలోని ప్రైవేట్ దవాఖానకు తరలించారు. మృతదేహాలను రాజ్‌నగర్‌లోని ప్రభుత్వ దవాఖానలో పోస్ట్‌మార్టం జరుపుతున్నారు. రాజ్‌నగర్‌లోని హంసాల్లో ఫౌండ్రీ పనిచేసేందుకు వీరంతా బయల్దేరినట్లు సమాచారం. కూలీలు పశ్చిమ సింగ్‌భూమ్‌లోని గలుబాసా, గాగ్రీ నివాసితులు. పికప్ వ్యాన్ డ్రైవర్ ఖర్సావాన్ నివాసి. ప్రమాదం జరిగిన తర్వాత అక్కడి నుంచి పారిపోయాడని పోలీసులు గుర్తించారు.

# పల్లెబాట పట్టిన పట్టణ ప్రజలు

## ప్రయాణికులతో ప్రత్యేక బస్సులు కిటకిట ● బస్టాండ్లలో పెరుగుతున్న రద్దీ





హైదరాబాద్,జనవరి12(సమసమాజం): ఆర్టీసీ ప్రత్యేక బస్సులను నడిపిన్నా, పండగకు వెళ్లాలనుకున్న వారికి పడిగాపులు తప్పడం లేదు. వివిధ రూట్లలో బస్సులు సరిపోక ప్రయాణికులు బస్టాండ్లలో పిల్లాపాపలతో ఎదురు చూస్తున్నారు. గతంతో పోలిస్తే సరిపడా బస్సులను ఆర్టీసీ అందుబాటులోకి తీసుకుని వచ్చింది. అయినా నగరం నుంచి జిల్లాలకు వెళ్లేవారు ఆర్టీసీ బస్సులను ఆశ్రయించడంతో బస్టాండ్లలో రద్దీ కనిపిస్తోంది. ఇప్పటి నుంచే జిల్లాల్లో సంక్రాంతి సందడి నెలకొంది. పల్లెల నుంచి పట్టణానికి వచ్చిన వలస కూలీలు, పాఠశాలలకు సెలవులు ప్రకటించటంతో హాస్టళ్లలో ఉండే విద్యార్థులు సంక్రాంతిని పండుగకు తమ తమ సొంతూళ్లకు పయనమవుతున్నారు. ఉపాధ్యాయులు కూడా తమ కుటుంబ సభ్యులతో కలిసి పుట్టిన ఊళ్లలో ఈ సంక్రాంతి సెలవుల్లో సరదాగా గడిపేందుకు సిద్ధమయ్యారు. దీంతో ఆర్టీసీ బస్సులు జనంతో కిటకిటలాడుతోంది. బస్సుల్లో ఖాళీ లేక ప్రయాణికులు వేరే బస్సుల కోసం బస్టాండ్ వేచి ఉంటున్నారు. ఆర్టీసీ సంస్థ కూడా పండుగను దృష్టిలో ఉంచుకొని హైదరాబాద్ ఇతరత్రా ప్రాంతాలకు ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసింది. ఉన్న బస్సులను ప్రత్యేక ట్రిప్పులుగా నడుపుతున్నామని ఆర్టీసీ అధికారులు చెప్పారు. ఇకపోతే సంక్రాంతి పండుగ సందర్భంగా హైదరాబాద్ నగరవాసులు గ్రామాల బాట పట్టారు. సంక్రాంతిని సొంతూళ్లలో జరుపుకునేందుకు సొంతవాహనాల్లో బయలుదేరారు. స్కూళ్లకు సెలవు లు ప్రకటించడంతో అంతా గ్రామాలబాట పట్టారు. దీంతో హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిపై వాహనాల రద్దీ పెరిగింది. విజయవాడ వైపు వెళ్లే వాహనాల కారణంగా పతంగి టోల్‌గేట్ వద్ద రద్దీ నెల కొంది. సంక్రాంతి సెలవులు రావడంతో ఊళ్లకు వెళ్లే వారితో వాహనాల రద్దీ పెరిగింది. హైదరాబాద్‌లో స్థిరపడ్డ ఆంధ్రా ప్రాంత వాసులు మొత్తం ఈ టోల్‌గేట్ మీదుగానే వెళ్లాలి. దీంతో రహదారి పై వాహనాల రద్దీ పెరిగింది. శు క్రవారం నుంచి సంక్రాంతి పండుగ సెలవులు ఇవ్వడం, శనివారం రెండో శనివారం సెలవు కావడంతో ఇక పండుగకు సొంత ఊళ్ళకు పెద్దఎత్తున సొంత వాహనాల్లో తరలి వెళుతు న్నారు. సంక్రాంతి పండగకు సొంతూళ్లకు వెళ్లే ప్రయాణికులతో బస్టాండ్లు, రైల్వేస్టేషన్లు కిటకిటలాడు తున్నాయి. తెలంగాణ జిల్లాలతో పాటు ఆంధ్రప్రదేశ్‌లోని పలు ప్రాంతాలకు ప్రత్యేక బస్సులు నడుపు తున్నట్లు టీఎస్ ఆర్టీసీ పేర్కొంది. సికింద్రాబాద్ రైల్వే స్టేషన అయితే జనసంద్రమవుతోంది. బెర్త్ రిజర్వేషనలు ఎప్పుడో పూర్తయ్యాయి. దీంతో జనరల్ బోగీలోకి వెళ్లేందుకు ప్రయాణికులు సర్కస్ ఫీట్లు చేస్తున్నారు.ఎంజీబీఎస్, జేబీఎస్ బస్టాండ్ల నుంచి ప్రత్యేక బస్సులు జిల్లాలకు వెళ్లినట్లు ఆర్టీసీ అధికారులు తెలిపారు. రద్దీ నేపథ్యంలో మరిన్ని పెంచేందుకు చర్యలు తీసుకుంటునట్లు అధికారులు తెలిపారు.





## కళకళలాడుతున్న వస్త్రవ్యాపారం

### డిస్కౌంట్లు, ఆఫర్లతో పెరిగిన అమ్మకాలు



విజయవాడ,జనవరి12(సమసమాజం): సంక్రాంతికి వస్త్ర వ్యాపారాం జోరుగా సాగుతోంది. గత రెండేళ్లుగా కరోనా భయాలతో పెద్దగా వ్యాపారాలు జరగలేదని వ్యాపారులు అంటున్నారు. తాజాగా రెడీమేడ్ వస్త్రమార్కెట్లో డిస్కౌంట్లు, ఆఫర్లమోత మోగుతోంది. పెద్ద పండగ సంక్రాంతికి మరో రెండు రోజుల సమయం మాత్రమే ఉండంతో వస్త్ర మార్కెట్లో మాత్రం సందడి వాతావరణం కనిపిస్తోంది. పెద్దపెద్ద షాపింగ్ మాల్స్ ప్రకటనలతో చిన్నవ్యాపారులు చితికి పోతున్నారు. తమవైపు ఎవరుచూడడం లేదని వాపోతున్నారు. ఒకటి కొంటే ఒకటి ఉచితం వంటి ఆఫర్లు, డిస్కౌంట్లు ఆకర్షణీయంగా కొనుగోలుదారులను ఆకర్షిస్తున్నాయి. ప్రస్తుతం షాపింగ్‌కోసం మహిళలు, యువతులు పెద్దఎత్తున తరలివస్తున్నారు. పురుషుల సంఖ్య చాలా తక్కువగానే ఉంటోంది. ఏ షాపులో చూసినా మహిళామణులదే హడావిడి. దీంతో మెయిన్‌రోడ్డుతోపాటు తాడితోట వస్త్రదుకాణ సముదాయం లోనూ షాపులన్నీ పండుగ కళను సంతరించుకుంటున్నాయి. చీరలపై ఆకర్షణీయమైన ప్రకటనతో మహిళలను ఆకట్టుకునే ప్రయత్నం చేస్తున్నారు. పెద్దషాపులన్నీ కొనుగోలుదారులతో రద్దీగా మారుతున్నాయి. షాపులు ఈ ఆఫర్ల కారణంగా రద్దీగా కనిపిస్తున్నాయి. ఇక్కడి పెద్ద షాపు ల్లో ఒకటి కొంటే ఒకటి ఉచితం ఆఫర్ తారకమంత్రంలా మహిళలను ఆకర్షిస్తోంది. రెడీమేడ్ షాపుల్లో 20శాతం నుంచి 30శాతం డిస్కౌంట్లు కూడా పెట్టేశారు. అన్ని రకాల వస్త్రాలపై 10శాతం డిస్కౌంట్, పట్టుచీరల కొనుగోలుపై వడ్డాణం ఉచితం, కొనుగోళ్లపై బకెట్లు, బ్యాగ్‌లు, కుర్చీలు ఉచితం అంటూ ఆకట్టుకునే ప్రకటనలు గుప్పిస్తున్నారు. సంపన్నులతోపాటు మధ్యతరగతి వర్గాలు, దిగువ మధ్య తరగతి కూడా ఈ పెద్దపెద్ద షాపులకే మళ్లుతుండడం గమనార్హం. ÷రాజమహేంద్రవరం మెయిన్‌రోడ్డులో రెడీమేడ్ షాపులు పెద్దవి పది నుంచి పదిహేను వరకూ ఉంటే చిన్న షాపులు వందల్లో ఉన్నాయి. భోగి పండక్కి రెండురోజుల ముందునుంచైనా వ్యాపారాలు ఊపందు కుంటాయనే ఆశతో చిన్న వ్యాపారులున్నారు. పండక్కి మరింత రద్దీ పెరిగే అవకాశం ఉంది. ఇక ఫుట్‌పాత్ రెడీమేడ్ వస్త్ర వ్యాపారం ఇక్కడ జోరుగా సాగుతోంది. రోడ్డుపైన గుట్టలుగా పోసి విక్రయాలు చేస్తున్నారు.

## కోడి పందాలకు ఘన చరిత్ర



గుంటూరు,జనవరి12(సమసమాజం): కోడి పందాల చరిత్రకు వందల ఏళ్ల చరిత్ర ఉంది.ఆరువేల సంవత్సరాల క్రితం నుంచే అనేక దేశాల్లో ఈ క్రీడ ఉండేదని చెప్పేందుకు చారిత్రక ఆనవాళ్లున్నాయి. 1646లో జార్జి విల్సన్ అనే రచయిత కాక్ ఆఫ్ ది గేమ్ అనే పుస్తకంలో కోడి పందేల గురించి ప్రస్తావించారు. అమెరికా, జపాన్, ఇరాన్, ఇండోనేషియా, బ్రెజిల్, పెరు, ఫిలపైన్స్, మెక్సికో, ఫ్రాన్స్, క్యూబా, పాకిస్తాన్ మొదలైన దేశాల్లోని గ్రామీణ ప్రాంతాల్లో ఈ కోడి పందేలు ఇప్పటికీ కొనసాగుతూనే ఉన్నాయి.మనదేశంలోనూ అనాదిగా కోడిపందేలు జరుగుతూనే ఉన్నాయి. పల్నాటి యుద్ధంలోనూ దీని ప్రస్తావన ఉంది. మధ్య యుగాల నాడు ఈ కోడి పందేలు చూస్తూ ఎంజాయ్ చేయడమే కాదు... గెలుపోటములపై పందేలు కాసేవారు. చివరకు రాజ్యాలు కూడా ఫణంగా పెట్టేవారు. అయితే ఇప్పుడు రాజ్యాలు లేకపోయినా.. కోడిపందేలపై బెట్టింగుల జోరు ఓ రేంజ్‌లో జరుగుతుంది. ఆనాటి ఆచారమే నేటి వరకూ కొనసాగుతోంది. అందుకే కోడి పందాలకు గోదావరి జిల్లాల్లో క్రేజ్ ఏర్పడింది.

# సంక్రాంతి కానుకగా వందేభారత్

### 15న వర్చువల్‌గా ప్రారంభించనున్న మోడీ



హైదరాబాద్,జనవరి12(సమసమాజం): తెలుగు రాష్ట్ర ప్రజలకు కేంద్రం సంక్రాంతి కానుక అందించింది. వందేభారత్ రైలును నాలుగు రోజుల ముందే అందుబాటులోకి తీసుకుని రానుంది. ప్రధాని మోడీ నేరుగా వచ్చి 19న ప్రారంభించాల్సి ఉండగా ప్రధాని మోడీ పర్యట రద్దయ్యింది. సికింద్రాబాద్ -విశాఖపట్టణం మధ్య నడిచే 'వందే భారత్ ఎక్స్‌ప్రెస్' ను ఈనెల15వ తేదీన ప్రధాని నరేంద్ర మోడీ వర్చువల్ గా ప్రారంభించనున్నారు. సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ లో జరిగే ఈ కార్యక్రమంలో కేంద్ర మంత్రులు అశ్వినీ వైష్ణవ్,జి.కిషన్ రెడ్డి పాల్గొననున్నారు. 15న ఉదయం10 గంటలకు తొలి వందే భారత్ రైలు కూత పెట్టనుంది. షెడ్యూల్ ప్రకారం ఈనెల19వ తేదీన కార్యక్రమం జరగాల్సి ఉన్నప్పటికీ పండగ సమయంలో తెలుగు ప్రజలకు కానుకను ఇచ్చేందుకు నాలుగురోజులు ముందే ఈ రైలు ప్రారంభించనున్నారు. దేశంలోని 8వ వందే భారత్ రైలు సికింద్రాబాద్ నుంచి బయలుదేరి వరంగల్, ఖమ్మం, విజయవాడ, రాజమండ్రి మీదుగా దాదాపు 8 గంటల్లో విశాఖపట్టణం చేరుకోనుంది.

# పండగ కోసం ప్రత్యేక బస్సు సర్వీసులు




కడప,జనవరి12(సమసమాజం): సంక్రాంతి పండగ కోసం జిల్లావ్యాప్తంగా ఎనిమిది డిపోల పరిధిలో ప్రత్యేక బస్సు సర్వీసులను ఏర్పాటు చేశామని ఆర్టీసీ ప్రాంతీయ అధికారి తెలిపారు.సంక్రాంతి పండగకు వచ్చే వారు ఎలాంటి ఇబ్బందులు పడకుండా ఉండేందుకు రోజు వారీ బస్సు సర్వీసులు కాకుండా అదనంగా బస్సు సర్వీసులను ఏర్పాటు చేశామన్నారు. విజయవాడ, హైదరాబాదు నుంచి ప్రత్యేక బస్సు సర్వీసులను నడుపుతున్నామని చెప్పారు. హైదరాబాదు, బెంగళూరు, చెన్నై నుంచి బస్సు సర్వీసులను ఏర్పాటు చేశామన్నారు. పండగకోసం ఇప్పటి వరకు డ్రైవర్లకు శిక్షణ ఇచ్చామన్నారు. ముఖ్యమైన పండగ కావడంతో ఎక్కడెక్కడో ఉన్న వారందరూ వారి వారి సొంత ఊళ్లకు వస్తారని చెప్పారు. ప్రత్యేక బస్సుల్లో ప్రభుత్వ నిబంధనల మేరకు అదనంగా ఛార్జీలు వసూలు చేయడం లేదని పేర్కొన్నారు. జిల్లాలోని అన్ని డిపోల్లో ముందస్తు రిజర్వేషన్ ప్రవేశ పెట్టామన్నారు. అలానే తిరుగు ప్రయాణం కోసం ప్రత్యేక బస్సు సర్వీసులను ఏర్పాట్లపై కసరత్తు చేస్తున్నామన్నారు. ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా కావాల్సినన్ని బస్సు సర్వీసులను నడుపుతామని ఆర్‌ఎం చెప్పారు. బస్సుల కోసం ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. రాజంపేట, పులివెందులకు డీలక్స్ బస్సు సర్వీసులను ఏర్పాటు చేశామన్నారు. ప్రొద్దుటూరు నుంచి వయా కడప మీదుగా బెంగళూరుకు ప్రత్యేకంగా బస్సు సర్వీసును ఏర్పాటు చేస్తున్నామన్నారు. అందులో సగం సీట్లు ఏసీ, మిగిలిన సగం నాన్ ఏసీ ఉంటుందన్నారు. కడప నుంచి తిరుపతికి అల్ట్రా డీలక్స్ నాన్‌స్టాఫ్ బస్సు సర్వీసులను ఏర్పాటు చేశామన్నారు. టీవీ సౌకర్యంతోపాటు సీట్లు చాలా బాగుంటాయని చెప్పారు. కడప బద్వేలు, కావలి మీదుగా విజయవాడకు వెళ్లేందుకు కొత్తగా సూపర్‌లగ్జరీ బస్సు సర్వీస్సులు నడుస్తున్నాయని అన్నారు.

# కోడి పందాల వైపే ధ్యాస

## పండగకు ముందే బరులపై గురి ● ఏర్పాట్లతో సందడిగా మారిన పల్లెలు



ఏలూరు,జనవరి12(సమసమాజం): పండగ సమీపిస్తున్న వేళ కొందరి ధ్యాసంతా కోడిపందాలపైనే ఉంది. పందాలకు అనుకలంగా నిర్ణయం లేదా అన్నదే ఇప్పుడు చర్చ సాగుతోంది. ఏటా పందాలపై ప్రభుత్వ నిర్ణయం ఎలా ఉంటుందో అన్న ఎదురుచూపులు షరా మామూలుగా మారాయి. సంప్రదాయ పందేలకు అడ్డు చెప్పబోదన్న ఆశతో చాలామంది నిర్వాహకులు ఉన్నారు. ఏటా పశ్చిమగోదావరి జిల్లాలో 450 నుంచి 500కుపైగా బరులు ఏర్పాటవుతాయి. సంక్రాంతి మూడు రోజులూ కోట్ల రూపాయల విలువైన పందేలు కడతారు. అయితే పోలీసులు కఠినంగగా వ్యవహరించడంతో ఈసారి కచ్చితంగా కోడిపందేలు లేనట్టేనని కొందరు అంచనా వేస్తుంటే, పండగ దగ్గర పడేసరికి తమకు వాతావరణం సానుకూలం అవుతుందని మరికొందరు ధీమాతో ఉన్నారు. నిజానికి, ఈసారి పెద్దఎత్తున పందేం ఆడేందుకు నిర్వాహకులు సిద్ధమయ్యారు. గత రెండేళ్ఉలగా కరోనా కారణంగా అంతగా కోడి పందెం సాగలేదన్న అభిప్రాయం వారిలో ఉంది. దీంతో, పండగకు రెండు నెలల ముందునుంచే, జిల్లాలో పెద్ద పెద్ద బరులు ఏర్పాటు చేయడం



మొదలయింది. నిర్వాహకులు జాతి పుంజులపై లక్షల రూపాయలు ఖర్చుపెట్టు కొన్నారు. భీమవరం, ఉండి, పాలకొల్లు, ఆకివీడు, కాళ్ల, వీరవాసరం, కొణితివాడ, ఆచంట, పెనుమంత్ర, నర్సాపురం, మొగల్తూరు, యలమంచిలి, కలగంపూడి, జంగారెడ్డిగూడెం, కొవ్వూరు, గణపవరం, ఉంగుటూరు ప్రాంతాల్లో పందేం కోళ్లకు ప్రత్యేకంగా తర్ఫీదు ఇస్తున్నారు.

# శిల్పారామంలో 13 నుంచి సంక్రాంతి సంబరాలు

## పిల్లలకు శాస్త్రీయోక్తంగా భోగిపళ్ల వేడుకలు

హైదరాబాద్,జనవరి12(సమసమాజం): మాదాపూర్ శిల్పారామంలో సంక్రాంతి సంబరాలు మొదలు కానున్నాయి. ఈ నెల 13 నుంచి ముక్కనుమ పండుగ వరకు అంటే 13వ తేదీ నుండి 17 వరకు సంక్రాంతి పండుగను నిర్వహించడం జరుగుతుందని శిల్పారామం స్పెషల్ ఆఫీసర్ జి.కిషన్ రావు స్పష్టం చేశారు. పండుగ సందర్భంగా గంగిరెద్దులు, హరిదాసులు, బుడబుక్కలు, జంగమదేవరులు, పిట్టలదొరలు, ఎరుకలసాని..మొదలైన కళాకారులు ఇక్కడ సందడి చేస్తారని తెలిపారు. 14వ తేదీన భోగి పండుగ పురస్కరించుకొని 11 సంవత్సరంలోపు ఉన్న చిన్న పిల్లలకి 'భోగి పళ్ళ ' ఉత్సవం నిర్వహించడం జరుగుతుందన్నారు. సందర్శకులు పిల్లలను తీసుకొచ్చి భోగి పళ్ళను శాస్త్రోక్తంగా పోయించు కోవలసిందిగా జి కిషన్ రావు కోరారు. సంక్రాంతి పండుగకి బొమ్మల కొలువు కూడా ఏర్పాటు చేయడం జరుగుతుందని కిషన్ రావు వెల్లడించారు. ప్రతి రోజు సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నామని తెలిపారు. ఇందులో భాగంగా కళామండలం ప్రసాద్ తో కథాకళి ప్రదర్శన, బాల



త్రిపురసుందరి శిష్య బృందంతో కూచిపూడి నృత్య ప్రదర్శనలు, చంద్ర శేఖర్ శిష్య బృందంతో 'శ్రీ గోదా కళ్యాణం' నృత్య రూపకం, కృష్ణ కుమార్ కాకినాడ శిష్య బృందంతో కూచిపూడి నృత్యాలు, డాక్టర్ సాగర్, తుంకూర్, కర్ణాటక శిష్య బృందం, చిత్ర నారాయణన్ శిష్య బృందంతో భరతనాట్య ప్రదర్శనలు ఉన్నాయని ఆయన వెల్లడించారు. ఎడ్లబండి, బ్యాటరీ కార్ సవారీ, బోటింగ్, పిల్లల ఆటస్థలం నేషనల్ హ్యాండీ క్రాఫ్ట్ ఫెయిర్ సందర్భంగా హస్తకళా యూథపతుల స్టాల్స్ ఎన్నో మరెన్నో సందర్శకులకు అందుబాటులో ఉన్నాయని కిషన్ రావు పేర్కొన్నారు.

# ఆనందంలో లక్షలాది రైతు కుటుంబాలు

## రైతుబంధు సాయంపై పల్లా రాజేశ్వర్ రెడ్డి



హైదరాబాద్,జనవరి12(సమసమాజం): తెలంగాణ వ్యాప్తంగా రైతుబంధు పన్నీటి జల్లు చల్లింది. రైతుబంధు పథకం కింద ఇచ్చిన చెక్కులతో పెట్టుబడికి ఆసరా దక్కిందన్న ఆనందం వ్యక్తం అవుతోందని ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్ రెడ్డి అన్నారు. ఎకరాకు ఐదువేల చొప్పున అందచేశారు. రైతులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా నగదును అందజేశారు. ఆయా జిల్లాలో అత్యధికంగా ఉన్న గిరిజన రైతులు రైతుబంధు పథకం ద్వారా ఎక్కువ సంఖ్యలో ప్రయోజనం పొందారు. తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించిన తరువాత టీఆర్ఎస్ ప్రభుత్వంఅన్నదాతలను ఆదుకునేందుకు దేశ చరిత్రలోనే రైతుబంధు పథకాన్నిప్రవేశపెట్టి రైతులకు సాగు సహాయాన్ని ఉచితంగా అందించే కార్యక్రమం విజయవంతంగా కొనసాగిస్తోంది. రైతును రాజు చేయాలని.. అప్పులపాలవుతున్న రైతులను ఆదుకునేందుకు సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన రైతుబంధు పథకం వారికి ఆర్థికంగా అండదండగా నిలిచింది.అన్ని విధాలుగా రైతులకు మేలు చేసే విధంగా ఉందని పల్లా అభిప్రాయం వ్యక్తం చేశారు. రైతులను అన్ని విధాలుగా ఆదుకునేందుకు తెలంగాణ రాష్ట్రంలో టీఆర్ఎస్ ప్రభుత్వం తీసుకున్న ఈ ఉచిత పెట్టుబడి సహాయం కార్యక్రమానికి రైతుల నుంచి అనూహ్య స్పందన లభించింది. గత పాలకులు ఏనాడూ ఇలా ఆలోచించలేదని రైతుబంధు అందుకున్న రైతులు అభిప్రాయం వ్యక్తం చేశారు. సంక్షేమ దిశగా కొనసాగుతూ ప్రతీ ఇంటా ఆనందాన్ని నింపుతున్న ప్రభుత్వాన్ని రైతులంతా ఆశీర్వదించారు.అధికారులు, మంత్రులు, ఎమ్మెల్యేలు,ఎంపిలు నిరంతరంగా ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేశారు.

# రాజీనామా యోచనలో సోమేశ్ కుమార్ ?



అమరావతి,జనవరి12(సమసమాజం): తెలంగాణ హైకోర్టు ఆదేశాలతో రిలీవ్ అనంతరం ఆంధ్రప్రదేశ్‌కు వెళ్లిన తెలంగాణ ప్రభుత్వ మాజీ ప్రధాన కార్యదర్శి సోమేష్ కుమార్ ఏపీ సీఎం జగన్‌తో భేటీ అయ్యారు. దాదాపు గంట పాటు ఈ భేటీ సాగింది. మీడియాతో మాట్లాడేందుకు సోమేష్ విముఖత వ్యక్తం చేశారు. తాజా పరిణామాలపై జగన్ సోమేష్‌ను అడిగి తెలుసుకున్నట్లు తెలిసింది. ఏపీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్‌రెడ్డికి రిపోర్ట్ చేసిన అనంతరం సోమేష్ సీఎం జగన్ దగ్గరకు వెళ్లారు. సోమేష్‌కుమార్ జీఏడీలో రిపోర్ట్ చేసి స్వచ్ఛందంగా పదవీ విరమణ చేసేందుకు రాజీనామా లేఖను ఇవ్వాలని సోమేష్‌కుమార్ డిసైడ్ అయినట్లు సమాచారం. రాజీనామా అనంతరం తెలంగాణ ప్రభుత్వ ప్రధాన సలహాదారుగా సోమేష్‌కుమార్‌ను నియమిస్తారని రాజకీయ వర్గాల్లో జోరుగా ప్రచారం జరుగుతోంది. ఆంధ్రప్రదేశ్‌లో ప్రస్తుతం సీఎస్ స్థాయి పోస్టులేమీ ఖాళీగా లేవు. ప్రస్తుత ఏపీ సీఎస్ జవహర్ కూడా 2024 జూన్ వరకూ ఈ పోస్టులో కొనసాగేందుకు ఛాన్స్ ఉంది. సీఎంవోలో ఇతర ప్రధాన పోస్టులు కూడా గతేడాది నవంబర్‌లోనే.. అంటే ఇటీవలే భర్తీ కావడంతో సోమేష్ కుమార్‌కు సీఎస్ స్థాయి పోస్టు ఇచ్చే పరిస్థితి లేదు. దీంతో.. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా పనిచేసిన సోమేష్ అంతకంటే తక్కువ స్థాయి పోస్టుల్లో విధులు నిర్వర్తించేందుకు సిద్ధంగా లేరు. దీంతో.. రాజీనామా చేసి తెలంగాణ ప్రభుత్వ ప్రధాన సలహాదారుగా బాధ్యతలు స్వీకరించడమే మేలనే అభిప్రాయంలో సోమేష్ కుమార్ ఉన్నట్లు తెలిసింది.

### ఎపి ప్రభుత్వానికి రిపోర్ట్ చేసిన సోమేశ్ కుమార్

### సిఎస్ జవహర్ రెడ్డిని కలిసిన మాజీసిఎస్

అమరావతి,జనవరి12(సమసమాజం): ప్రభుత్వ అధికారిగా ఏపీ ప్రభుత్వం తనకి ఏ బాధ్యత ఇచ్చినా నెరవేరుస్తానని తెలంగాణ మాజీ సీఎస్ సోమేష్ కుమార్ అన్నారు. డీపీవోటీ అదేశాల మేరకే తాను ఏపీ ప్రభుత్వానికి రిపోర్టు చేస్తానని చెప్పారు. హైదరాబాద్ నుంచి విజయవాడకు చేరుకున్న ఆయన ముందుగా ఏపీ సీఎస్ జవహర్ రెడ్డిని కలిశారు. అనంతరం సీఎం జగన్‌తో భేటీ అయ్యారు. రాష్ట్ర విభజన సమయంలో సోమేశ్ కుమార్‌ను కేంద్రం ఏపీకి కేటాయించింది. అయితే కేంద్రం ఉత్తర్వులపై ఆయన క్యాట్‌ను ఆశ్రయించడంతో 2016లో సోమేశ్ కుమార్ తెలంగాణలో కొనసాగేలా హైదరాబాద్ క్యాట్ ఉత్తర్వులు జారీ చేసింది. క్యాట్ ఉత్తర్వులతో అప్పటి నుంచి సోమేశ్ తెలంగాణలోనే కొనసాగుతూ వచ్చారు.

# భవన నిర్మాణ కార్మికులను ఆదుకోవాలి



హైదరాబాద్,జనవరి12(సమసమాజం): భవన నిర్మాణ రంగం కార్మికుల సంక్షేమానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బడ్జెట్‌లో అధిక నిధులు కేటాయించాలని కార్మిక సంక్షేమ సంఘం డిమాండ్ చేసింది. ఈ రంగంలో ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని అన్నారు.తెలంగాణ రాష్ట్రం లో 20 లక్షల మంది భవన నిర్మాణ కార్మికులు 18 రకాల విభాగాల్లో పని చేస్తున్నారని తెలిపారు. అందులో 8 లక్షల మంది కార్మికుల పేర్లు మాత్రమే సంక్షేమ బోర్డులో నమోదై ఉన్నాయని చెప్పారు. మరికొంత మంది వలసలు పోతున్నారన్నారన్నారు. అడ్డాల ఏర్పాటు, ఆయా ప్రాంతాల్లో మౌ లిక వసతులు కల్పించాల్సిన లేబర్ శాఖ అధికారులు చోద్యం చేస్తున్నారని విమర్శించారు. సంక్షేమ బోర్డు ద్వారా కార్మికులకు గుర్తింపు కార్డులివ్వాలని, ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. పెట్టుబడిదారులు, బడా వ్యాపారులకు రాయితీలు ఇస్తున్న ప్రభుత్వం కార్మికులకు మాత్రం కూలి పెంపు, రుణాలివ్వడం లేదన్నారు. ఇసుక పాలసీపై స్పష్టమైన వైఖరి ప్రకటించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇసుక దొరక్క పనులు లేక భవన నిర్మాణ కార్మికుల కుటుంబాల పోషణ భారమై అనేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. రాష్ట్రంలో సెస్ ద్వారా సంక్షేమ బోర్డులో ఉన్న నిధులు కార్మి కుల సంక్షేమానికి ఖర్చు చేయకుండా ఇతర రంగాలకు మళ్లించడం సరికాదన్నారు.

# వైష్ణవాలయాల్లో ఘనంగా తిరుప్పావై రేపు గోదాకళ్యాణంతో ముగియనున్న ధనుర్మాసం



తిరుమల,జనవరి12(సమసమాజం): వైష్ణవాలయాల్లో ధనుర్మాస ఉత్సవాలు అంగరంగ వైభవంగా సాగుతున్నాయి. నిత్యం ఆలయాల్లో తిరుప్పావై ప్రవచనాలు సాగుతున్నాయి. ధనుర్మాసం చివరి అంకానికి చేరుకుంది. 14న భోగిరోజే గోదాకళ్యాణం నిర్వహిస్తారు. గోదా కళ్యాణాలకు ప్రత్యే ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ మేరకు అన్ని ఆలయాల్లో ఏర్పాట్లు చేశారు. ధనుర్మాసంలో వైష్ణవాలయాల్లో గోదాదేవి విరచిత తమిళ పాశురాలు వినిపిస్తుంటాయి. ఉత్తరాయణం ముందు వచ్చే ధనుర్మాసం దేవతలకు బ్రాహ్మీ సమయం. శ్రీరంగనాథుడి భక్తురాలైన గోదాదేవి నెల రోజుల పాటు రోజుకో పాశు రం చొప్పున కృష్ణలీలల్ని కీర్తిస్తూ శ్రీవ్రతం ఆచరించింది. ఈ 30 పాశురాలు 'తిరుప్పావై' పేరుతో ప్రఖ్యాతి గాంచాయి.తమిళనాడు లోని శ్రీవిల్లిపుత్తూరులో గోదాదేవి ఆలయం మధురభక్తిని నేటికీ చాటుతోంది. ధనుర్మాసం సందర్భంగా ఇక్కడ ప్రత్యేక పూజలు నిర్వహిస్తుంటారు. గోదాదేవి జన్మనక్షత్ర సమయంలో ఇక్కడ జరిగే రథోత్సవం, గోదాకల్యాణం వైభవంగా జరుగుతాయి.. ఈ ఆలయం నుంచి ఏటా బ్రహ్మోత్సవాల సమయంలో తిరుమలేశుడికి పూలహారాలు పంపించడం ఆనవాయితీ. మాసాల్లో మార్గశీర్షం నేను అని శ్రీకృష్ణ భగవానుడు భగవద్గీతలో చెబుతాడు. తమిళనాడు లోని శ్రీవిల్లిపుత్తూరుకు చెందిన విష్ణుచిత్తుడనే శ్రీరంగడి భక్తుడికి గోదాదేవి పసిబాలికగా ఉన్నప్పుడు దొరికింది. చిన్నప్పటి నుంచి ఆమెకు రంగడంటే వల్లమాలిన ప్రేమ. స్వామివారికి సమర్పించమని తన తండ్రి ఇచ్చిన పూలహారాలను ముందు తాను ధరించి స్వామికి ధరింపజేసేది గోదా! చివరకు శ్రీరంగడిని మనువాడి తన జన్మను చరితార్థం చేసుకుంది. తిరుమల శ్రీనివాసుడి సన్నిధిలో ధనుర్మాసమంతా సుప్రభాత సేవలో గోదాదేవి పాశురాలు ఆలపిస్తున్నారు. గోదాదేవి కృష్ణభక్తికి ప్రతీకగా శ్రీవారి పవళింపు సేవ రజత కృష్ణస్వామి మూర్తికి నిర్వహిస్తారు. ఈ ఆలయంలో శనివారం గోదా కళ్యాణం అత్యంత రమణీయంగా నిర్వహిస్తారు. తెలంగాణతో పాటు, అనేక వైష్ణవాలయాల్లో గోదాకళ్యాణ ఏర్పాట్లు చేశారు. ఆదిత్యుడు ధనస్సు రాశిలో ప్రవేశించి.. మళ్లీ మకర రాశిలోకి వెళ్లే వరకూ ఉన్న సమయమే ధనుర్మాసం. సూర్యుడు ఏడాదిలో ప్రతి నెలా ఒక్కో రాశిలో సంచరిస్తుంటాడు. సౌరమానం ప్రకారం సూర్యుడు ఏ రాశిలో ఉంటే.. ఆ నెలను ఆ రాశి పేరుతో పిలుస్తారు.మార్గశిరంలోనే ధనుర్మాసం ప్రారంభం అవుతుంది. అప్పటి నుంచి వైష్ణవాలయాలన్నీ భక్తులతో కిటకిటలాడుతుంటాయి. ధనుర్మాసంలో.. తెల్లవారుజాము నుంచే పండగ వాతావరణం నెలకొంటుంది. సంక్రాంతికి ముందే ధనుర్మాసం రావడంతో పొద్దుపొడవక ముందే కళ్లాపి చల్లడం, ముగ్గులు వేయడం, వూళ్లొని ఏదో ఆలయానికో తరలి వెళుతుంటారు.

# మాదాపూర్‌లో పోలీసుల తనిఖీలు

హైదరాబాద్,జనవరి12(సమసమాజం): సంక్రాంతి సెలవులు కారణంగా హైదరాబాద్, మాదాపూర్ జోన్ పరిధిలో పోలీసులు తనిఖీలు ముమ్మరం చేశారు. ఇతర రాష్ట్రాల నుంచి రైలులో వచ్చే అనుమానితులను లింగంపల్లి రైల్వే స్టేషన్‌లో పోలీసులు తనిఖీలు చేస్తున్నారు. గతంలో సంక్రాంతి సెలవుల సమయంలో జరిగిన దొంగతనాలను దృష్టిలో పెట్టుకొని తనిఖీలు చేస్తున్నారు. ముంబాయి, కర్నాటక, గుల్బర్గా, రాయచూర్ తదితర ప్రాంతాలకు ఇక్కడ నుంచి రైలు సౌకర్యం ఉండడంతో నిందితులు చోరీలు చేసి సులభంగా రైలు మార్గం గూండా వెళ్లిపోతున్నారు. గత అనుభవాలను దృష్టిలో పెట్టుకొని పోలీసులు తనిఖీలను ముమ్మరం చేశారు.

# ముంపు బాధితులకు హామీలు ఇచ్చి మరిచిండు

## గోదారి ముంపు బాధితులకు న్యాయం జరిగే వరకు పోరాటం చేస్తాం : ఇందిరా శోభన్

- క్రెడిబిలిటీ లేని నాయకుడు కేసీఆర్
- 18 వేల కుటుంబాలు గూడు కోల్పోయి రోడ్డున పడ్డారు
- ప్రభుత్వ భూమిలో పక్కా ఇల్లు నిర్మించాలి
- ఆర్థిక సహాయం అందించాలి
- సమస్య పరిష్కారం అయ్యేదాకా పోరాటం చేస్తాం



**హైదరాబాద్, జనవరి 12(సమ సమాజం):** క్రెడిబిలిటీ లేని ఒక నాయకుడిగా మీరు దేశ రాజకీయాలు ఎలా చేస్తారని, ఢిల్లీ ముఖ్యమంత్రి ఒక మాట ఇస్తే 100% దాని నెరవేరుస్తారని అమ్ ఆద్మీ పార్టీ తెలంగాణ రాష్ట్ర కోర్ కమిటి సభ్యురాలు ఇందిరా శోభన్ అన్నారు. భద్రాచలం కొత్తగూడెంలో నిర్వహించిన సభలో ఇచ్చిన హామీలపై స్పందిస్తూ ఇందిరా శోభన్ మీడియాతో మాట్లాడారు. రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ రాష్ట్ర ఖజానాకు లోటు లేదని రాష్ట్ర ఖజానాలో మస్తు డబ్బులు ఉన్నాయని ఒకవైపు చెపుతున్న ముఖ్యమంత్రి కేసీఆర్ గత సంవత్సరం జూలైలో 17వ తారీఖున గోదావరి ముంపు బాధితులకు ముంపుకు గురికాకుండా వేరే దగ్గరకి తరలించి పక్కా గృహాలు నిర్మించాడానికి రాష్ట్ర ఖజానా నుండి 1000 కోట్లను మంజూరు చేస్తానన్న హామీని ఏమైందని గుర్తు చేశారు. ఖజానాలో పైసలకు లోటు లేదని మస్తుగా పైసలు ఉన్నాయని చెప్పి స్వయంగా ముఖ్యమంత్రి ఇచ్చిన హామీ ఎందుకు అమలవుతలేదని ప్రజలు గత మూడు నెలలుగా నిరసన దీక్ష ఎందుకు చేస్తున్నారని ముఖ్యమంత్రి గారిని ఇందిరా శోభన్ నిలదీశారు. వివరాల్లోకి వెళితే జులై, ఆగస్టు నెలలలో గోదావరి వరదలకు పోలవరం బ్యాక్ వాటర్ తో, వరద ముంపుకు గురైన దాదాపు 18 వేల కుటుంబాలు గూడు కోల్పోయి రోడ్డున పడ్డాయి అయితే వారికి ముఖ్యమంత్రి కెసిఆర్ జులై 17న భద్రాచలం వెళ్లి బాధితులకు పదివేల రూపాయలు ఆర్థిక సహాయం ,ఉచిత రేషన్, డబల్ బెడ్ రూమ్ ఇండ్లు వెంటనే కట్టించే ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు. నిజమే అని నమ్మిన గోదావరి ముంపు బాధితులు ముఖ్యమంత్రి హామీ అమలు గురించి ఎదురుచూస్తూ చివరకు ప్రభుత్వం ముఖ్యమంత్రి ఇచ్చిన హామీని అమలు చేయాలని కోరుతూ ఆదివాసులు దాదాపు 150 రోజుల నుండి పిల్లలు జల్లలు వృద్ధులు గర్భిణీలు కలసి దీక్ష చేస్తున్నారు. అధికారులు ఇప్పటి వరకు కనీసం భూమి కూడా చూడలేదనీ గతంలో ఇచ్చిన హామీకే దిక్కు లేదని మళ్లీ ముఖ్యమంత్రి గారు కొత్తగా హామీలు ఇవ్వడం విచిత్రంగా ఉందని ఇందిరా శోభన్ ప్రశ్నించారు. బూర్గంపాడులో 7000 కుటుంబాలు, అశ్వాపురంలో 1458, పినపాక 1341, మణుగూరు 392, దమ్మగూడెం 1920, చర్ల 2889, భద్రాచలంలో 2913, దాదాపు 17,913 కుటుంబాలు రోడ్డున పడ్డాయని బాధితుల గోడు వినే నాధుడే లేడని ఇందిరా శోభన్ ఆవేదన వ్యక్తం చేశారు. 437 సర్వే నెంబర్లు వేల ఎకరాలు ప్రభుత్వ భూమి ఉంది కానీ ఆ భూమి ఇప్పుడు అటవీశాఖ కలుపుకుంది. వెంటనే ప్రభుత్వం చొరవ తీసుకొని ఆ భూమిలో వాళ్లకి ఇల్లు కట్టించాలని గోదావరి ముంపు బాధితుల కుటుంబాలు పెద్ద ఎత్తున ఆందోళన చేస్తున్నారు. ముఖ్యమంత్రి గారు కలెక్టర్ ఆఫీస్, బిఆర్ఎస్ భవనం ఓపెనింగ్ కి కొత్తగూడెం వెళ్లారు, గతంలో ఇచ్చినటువంటి హామీ ఇప్పటికీ అతిగతి లేదు కానీ కొత్త హామీలను మళ్లీ కురిపించారు. మున్సిపాలిటీలకు 25కోట్లు.. 40 కోట్లు, 1981 గ్రామాలకు 10 లక్షల రూపాయలు, మైనింగ్ ఇన్స్టిట్యూషన్ అసమగ్రంగా ఉంది దీన్ని కూడా బాగు చేస్తామని మహబూబాబాద్ కి 50 కోట్లు... గోదావరి ముంపు బాధితుల కుటుంబాలకు ముంపుకు గురికాకుండా 90 ఫీట్ల ఎత్తులో పక్కా ఇల్లు నిర్మించి ఆ ఇండ్లలో వారిని తరలించడానికి 1000 కోట్ల రూపాయలు మంజూరు చేస్తానని చెప్పిన ముఖ్యమంత్రి కనీసం వారికి ఇస్తానన్న తక్షణ ఆర్థిక సహాయం 1000 కూడా మంజూరు చేయకుండా మళ్లీ ఉద్దెర హామీలు కురిపించారని ఇలా ప్రతిసారి ప్రజలకు హామీలు ఇవ్వడం మర్చిపోవడం తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి కి అలవాటుగా మారిందని ఇందిరా శోభన్ ఎద్దేవా చేశారు. ముఖ్యమంత్రి కొత్తగూడెం భద్రాచలం పర్యటనకు వస్తున్నారని ముంపు బాధితుల కుటుంబాల పక్షాన పోరాడుతున్న నాయకులైన ఆదివాసులను, సేవాలాల్ సేన నాయకులను పోలీసు అధికారులు ముందస్తు అరెస్ట్ చేశారు. ముఖ్యమంత్రి హామీలు ఇచ్చి హామీలు అమలు చేయకుండా ప్రజల సమస్యలు పరిష్కరించకుండా వాళ్లు ఏడ ప్రశ్నిస్తారొనని వారికి సమాధానం చెప్పడానికి మొఖం లేక వారిని ఇలా అప్రజా సామికంగా అక్రమంగా పోలీసు అధికారులు అరెస్టు చేయడాన్ని అమ్ ఆద్మీ పార్టీ తెలంగాణ రాష్ట్ర శాఖ తీవ్రంగా ఖండిస్తుందని ఇందిరా శోభన్ తెలిపారు. 437 సర్వే నెంబర్లు వేల ఎకరాలు ప్రభుత్వ భూమి ఉన్నది ఆ భూమిలో రోడ్డున పడ్డ 18 వేల కుటుంబాలకు వెంటనే ఇల్లు కట్టించే ఏర్పాటు చేయాలని ఆమ్ ఆద్మీ పార్టీ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నదని లేనియెడల గోదావరి ముంపు బాధితుల తరపున ఆమ్ ఆద్మీ పార్టీ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వంపై సమస్య పరిష్కారం అయ్యేదాకా పోరాటం చేస్తుందని ఇందిరా శోభన్ ఈ సందర్భంగా ముఖ్యమంత్రి కేసీఆర్‌ను హెచ్చరించారు. వైరా నియోజకవర్గ దీక్ష చేస్తున్న బాధితులకు మద్దతు తెలిపారు.

# పిల్లల పోషకాహార అంచనా కార్యక్రమం విజయవంతం

## ప్రభుత్వ నిజామియా టిబ్బి కళాశాల, నిజామియా జనరల్ హాస్పిటల్ ఆధ్వర్యంలో నిర్వహణ




**హైదరాబాద్, జనవరి 12(సమ సమాజం):** ప్రభుత్వ నిజామియా టిబ్బి కళాశాల, నిజామియా జనరల్ హాస్పిటల్ ఆధ్వర్యంలో పిల్లల పోషకాహార అంచనా కార్యక్రమం జరిగింది. కేంద్ర విద్యాలయ కంచన్‌బాగ్‌లో ఈ కార్యక్రమం బుధవారం ఉదయం 8.30 గం॥ల నుండి 2.30 గం॥ల వరకు నిర్వహించారు. 396 ప్రాథమిక పాఠశాలల విద్యార్థులు అధునాతన సాధనాలను ఉపయోగించడం ద్వారా పోషకాహార స్థితిని అంచనా వేశారు. దీని పై అవగాహన కల్పించారు. అంతే కాకుండా అధ్యాపకులచే కౌన్సిలింగ్ ఇచ్చారు. డెప్టాప్ ప్రివెంటివ్, కమ్యూనిటీ మెడిసిన్ స్కాలర్‌లు హైదరాబాద్, ప్రభుత్వ నిజామియా టిబ్బి కాలేజ్ చార్మినార్‌లోని ఇయర్ బమ్స్ విద్యార్థులు పరిశీలన, ప్రయోజనం కోసం 50 పోస్టర్‌ల ప్రదర్శనను ఏర్పాటు చేశారు. కొవ్వుల ప్రాముఖ్యత గురించి ప్రొటీన్స్ విటమిన్లు, కార్బోహైడ్రేట్లు, మినరల్స్, పోస్టర్లు రోజువారీ అవసరాలు, రిచ్ సోర్సెస్ లోపం వల్ల శరీరంపై ప్రభావం చూపుతుంది. ఈ కార్యక్రమంలో డాక్టర్ షాజాది సుల్తానా, ప్రిన్సిపాల్ డాక్టర్ కె.కవిత, సూపరిండెంట్ హేమలతా రావ్, డా॥ మహబూబ్ హుస్సేన్, ప్రొఫేసర్, హెచ్‌ఓడీ, డా॥ జూవేరీయా ఇఫాత్, డా॥ కౌసర్ సుత్తానా, డా॥ ఫౌజీయా అంజూమం, శిబిరంలో 4 మంది సిబ్బంది పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని విద్యార్థులచే నిర్వహించారు.



# ఖమ్మం జైల్లో పెడితే ..కడుపులో పెట్టి కాపాడారు

## ఉద్యమ సంఘటనను గుర్తు చేసుకున్న కెసిఆర్

. భద్రాద్రి కొత్తగూడెం,జనవరి12(సమసమాజం):
భద్రాద్రి కొత్తగూడెం కలెక్టరేట్‌ప్రారంభోత్సవం సందర్భంగా సీఎం కేసీఆర్ ఉద్యమ రోజులను గుర్తుచేసుకున్నారు. తెలంగాణ ఉద్యమ సమయంలో తనను అక్రమంగా అరెస్ట్ చేసి ఖమ్మం జిల్లా జైల్లో పెట్టారని అన్నారు. అప్పుడు స్థానిక ప్రజలు ఎంతో పోరాటం చేసి తనను కాపాడుకున్నారని చెప్పారు. ఉమ్మడి ఖమ్మం జిల్లా చైతన్యవంతమైన జిల్లా అని, అందరి ఐక్య పోరాటం తోనే తెలంగాణ సిద్ధించిందని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా సీఎం జిల్లాకు పలు వరాలు కురిపించారు. సీఎం హామీలు ఇస్తుండగా జనం పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. దీనిపై స్పందించిన సీఎం.. 'ఇక్కడ కొత్త రకంగా అరుస్తున్నారు. సర్కస్ లెక్క. ఇదేం అరుసుడు ' అని కామెంట్ చేశారు. కాగా జిల్లాలోని 481 గ్రామాలకు రూ.10 లక్షల చొప్పున ఇస్తామని కేసీఆర్ ప్రకటించారు. కొత్తగూడెం, పాల్వంచ మున్సిపాలిటీ లకు 40 కోట్లు.. మణగూరు, ఇల్లందు 25 కోట్లు మంజూరు చేస్తున్నట్లు చెప్పారు. జిల్లాలో మైనింగ్ ఇన్సిటిట్యూషన్ ఇంజనీరింగ్ కాలేజీగా మారుస్తామని హామీ ఇచ్చారు. జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలను మంజూరు చేస్తామని చెప్పారు

# కోనసీమలో సీమాంతర కోళ్ల జోరు

**ఇతర రాష్ట్రాల నుంచి కోళ్ల దిగుమతి ● పందాలకు రెడీ అవుతున్న ప్రజలు**



రాజమండ్రి, జనవరి12(సమసమాజం): ఈ ఏడాది జిల్లాలో పందేలకు తమిళనాడుకు చెందిన కోళ్లు ముందుగానే కాళ్లు దువ్వుతున్నాయి. రాజమహేంద్రవరంలో ఈ కోళ్లను పెద్ద ఎత్తున విక్రయిస్తున్నారు. ప్రస్తుతం ఒక్కో కోడి ధర రూ.నాలుగు వేల నుంచి రూ.10 వేలకు పైగా పలుకుతోంది. కోరుకొండ, రాజమహేంద్రవరం గ్రామీణం, రాజానగరం తదితర ప్రాంతాల్లో ఇప్పటికే కోడి పందేల జోరు కొనసాగుతుండగా, పందెంకోళ్ల పెంపకం ఓ కుటీర పరిశ్రమగా మారింది. ఈ సీజన్ వస్తే కోళ్లలో రకాన్ని ఆధారంగా రూ.వేలల్లో ధర నిర్ణయిస్తున్నారు. కోనసీమలో సంక్రాంతి సందడి మొదలైంది. భోగి మంటలు, రంగురంగుల ముగ్గులు, పిండి వంటలు, ఇంటి నిండా బంధువులు... సంక్రాంతి అంటే వారం రోజుల పాటు ఇంటింటా సందడే సందడి. ఇదంతా ఒక ఎత్తు అయితే పండుగ సమయంలో గోదావరి జిల్లాలో నిర్వహించే కోడి పందేల గురించి ఎంత చెప్పకున్నా తక్కువే. పైగా ఈసారి కోడి పందేల్లో ఓ ప్రత్యేక ఉంది. పందెం కోళ్లు యుద్ధానికి సిద్ధమవుతున్నాయి. సంక్రాంతి వచ్చిందటే చాలు జిల్లాలో కోడిపందేలా జోరు కొనసాగుతుంది. ప్రధానంగా ఈసారి వెరైటీ కోళ్లు బరిలో ఉండబోతున్నాయి. ఓ వైపు తమిళనాడు కోళ్లుమ మరోవైపు పాక్ కోళ్లు, ఇంకో వైపు స్థానికంగా పెంచిన కోళ్లు కూడా బరిలోకి దిగబోతున్నాయి. ఇప్పటికే జిల్లాలో వీటిని దిగుమతి చేసుకున్నారు. పోలీసుల ఆంక్షలు చివరి నిమిషంలో ఆచరణకు నోచుకోక పోవడం పరిపాటిగా మారింది. ఈ పందేల్లో పాల్గొనేందుకు ఇతర రాష్ట్రాల నుంచి సైతం పలువురు తరలివస్తుంటారు. పందేల నిర్వహణకు పది రోజుల ముందే కొనుగోలు చేసి వాటికి మంచి ఆహారం, తర్ఫీదు ఇచ్చి సిద్ధం చేసేందుకు ప్రత్యేకంగా శిక్షకులను సైతం ఏర్పాటు చేసుకుంటున్నారు. ఇక గోదావరి కోళ్లతో పాకిస్తాన్ కోళ్లు పోటీపడ బోతున్నాయి. గెలిస్తే కోడిని వండుకుని తినే ఆచారం ఉంది. సంక్రాంతి వేళ గోదావరి జిల్లాల్లో పందెంకోళ్ల మాంసం తప్ప..బ్రాయిలర్, మామూలు కోళ్ల మాంసం కూడా ముట్టుకోరు. పందెంకోడిని బంధుమిత్రులకు వండిపెట్టడం ఓ ప్రత్యేకత. సంక్రాంతి వేళ కోడి పందేలు నిర్వహించేడమే కాదు... ఒక్కో కోడికి రూ. వేల నుంచి లక్షలు ఖర్చు చేసి ఖరీదైన, బలమైన తిండి పెడతారు. వాటికోసం ప్రత్యేక ట్రైనర్లు కూడా ఉంటారు. పందాల్లో పాకిస్తాన్ కోళ్లకు మంచి క్రేజ్ ంది. అందుకే ఈ మధ్య థైవాన్, మలేషియా, ఇండోనేషియా,పాకిస్తాన్ లాంటి ప్రాంతాలనుంచి కూడా కోనసీమ పెంపకం దారులు బ్రీడ్ తెప్పించి పెంచుతున్నారు. ముఖ్యంగా కత్తులు కట్టకుండా వేసే పందాలకు పాకిస్థాన్ బ్రీడ్ కోళ్లు బాగా ఉపయోగ పడుతున్నాయని చెబుతున్నారు. ఒకప్పుడు వేల రూపాయల్లో మొదలైన కోడి పందాలు ఇప్పుడు కోట్ల రూపాయల్లో చేతులు మారుతున్నాయి. తూర్పుగోదావరి



జిల్లాలో గతేడాది వంద కోట్ల రూపాయలకు పైగా చేతులు మారాయ్. పశ్చిమగోదావరి జిల్లాలోనూ ఈలెక్క పెరిగిందే కానీ తగ్గలేదు. ఇక పందెంలో వీర మరణం పొందిన పుంజుల .. మాంసానికి చాలా డిమాండ్. వాటిని పెంచడానికి అత్యంత బలమైన ఆహారం పెట్టడంతో ఆ మాంసం రుచి ప్రత్యేకంగా ఉంటుంది. అందుకే పందెంలో ఓడిన కోడిని దక్కించుకునేందుకు వేలం పాటలు జరుగుతాయి. కోర్టులు, ప్రభుత్వం, పోలీసులు ఎంత కఠినంగా వ్యవహరించినా వెనక్కి తగ్గరు. పైగా తమిళనాడు లాంటి ప్రాంతాల్లో కోడి పందేలకు ప్రత్యేక టోర్నమెంట్‌లు ఉంటాయని, ఒక్క ఆంధ్రప్రదేశ్‌లోనే ఆంక్షలు ఉంటాయంటూ మండిపడుతున్నారు. ఎన్ని హెచ్చరికలు ఉన్నా పందేల విషయంలో వెనుకడుగు వేయరు.

# సంక్రాంతి కానుకగా ఒక డిఏ ఇస్తామన్నారు

## ఉద్యోగుల జెఎసి వెల్లడి


అమరావతి,జనవరి12(సమసమాజం): ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయులకు రెండు కొత్త డిఎల్లో ఒక డిఎను సంక్రాంతి రోజు ప్రకటిస్తామని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి హామీ ఇచ్చిన్నట్లు ఎపి ప్రభుత్వ ఉపాధ్యాయ, ఉద్యోగుల జెఎసి వెల్లడించింది. సిఎం జగన్‌ను పలు ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు బుధవారం క్యాంపు కార్యాలయంలో కలిశాయి. ఈ సందర్భంగా ఆయా సంఘాల డైరీలు, క్యాలెండర్లను సిఎం ఆవిష్కరించారు. ఉద్యోగుల సమస్యలపై సంఘాల నాయకులు పలు వినతిపత్రాలు సిఎంకు అందించారు. కాయి పడ్డ వివిధ ఎపిజిఎల్ఐ, పిఎఫ్, డిఎ లోన్లు, ÷-లకైమ్స్‌ల్లో కొంతమేర జనవరి ఆఖరులోపు చెల్లిస్తామని హామీ ఇచ్చారని ఎపి జెఎసి చైర్మన్ బండి శ్రీనివాసరావు, సెక్రటరీ జనరల్ జి హృదయరాజు ఒక ప్రకటన ద్వారా తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగులకు పెంచిన 62 పదవి విరమణ వయస్సును పబ్లిక్ సెక్టార్, ఇతర విద్యాసంస్థల ఉపాధ్యాయులకు అమలు చేస్తూ త్వరలోనే ఉత్తర్వులు ఇస్తామని సిఎం హామీ ఇచ్చారని పేర్కొన్నారు. ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను సిఎం దృష్టికి తీసుకెళ్లామని, సంబంధిత శాఖల అధికారులతో చర్చించి పరిష్కరిస్తామని సానుకూలత వ్యక్తం చేశారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి, ఉద్యోగుల సలహాదారు చంద్రశేఖర్ రెడ్డి, ఎమ్మెల్సీ కల్పలతారెడ్డి తదితరులు పాల్గొన్నారు. సీఎంను కలిసిన వారిలో జెఎసి కో చైర్మన్లు హెచ్ తిమ్మన్న, కెఎస్ఎస్ ప్రసాద్, సీతారామరాజు, డిప్యూటీ సెక్రటరీ జనరల్ కెవి శివారెడ్డి తదితరులు ఉన్నారు. ఎపి సివిల్ సర్వీసెస్ అసోసియేషన్ ప్రతినిధులు పి ధర్మచంద్రారెడ్డి, కె మోహన్ కుమార్, ఈ మురళి,ఎపి సచివాలయ ఉద్యోగుల అసోసియేషన్ అధ్యక్షులు కె వెంకటరామిరెడ్డి, నాయకులు సిహెచ్ ఎర్రన్న యాదవ్, ఎం సత్య సులోచన, ఎపి ప్రభుత్వం ఉద్యోగుల అసోసియేషన్ అధ్యక్షులు కెఆర్ సూర్యనారాయణ, నాయకులు అస్కార్ రావు, జిఎం రమేష్, వైఎస్ఆర్‌టిఎఫ్ నాయకులు ఓబులాపతి, జాలిరెడ్డి, అశోక్, సుధీర్, పిఆర్‌టియు అధ్యక్షులు గిరిప్రసాద్ రెడ్డి తదితరులు ఉన్నారు.

# జగన్ సర్కార్‌పై ప్రజల్లో అసహ్యం

## ధరల పెరుగుదలతో ప్రజల్లో ఆగ్రహం, మాజీమంత్రి, టిడిపినేతల యనమల

అమరావతి, జనవరి 12 (సమసమాజం): జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం పై టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు, మాజీ మంత్రి యనమల రామకృష్ణుడు తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. గురువారం ఆయన ఇక్కడ మీడియాతో మాట్లాడుతూ ధరలను పెంచి నడ్డివిరుస్తున్న జగన్ రెడ్డి సర్కార్ అంటే ప్రజలకు అసహ్యం కలుగుతోందన్నారు. రవాణా వాహనాల పన్ను పెంపుతో ప్రజలపై ఏటా రూ.250 కోట్ల అదనపు భారం పడుతోందని అన్నారు. టీడీపీ పాలనలో రవాణా శాఖకు 6 నెలలకు రూ.1,500 కోట్ల వరకూ ఆదాయం వచ్చేదని.. జగన్ రెడ్డి బాదుడుతో 6 నెలల్లో రూ.2,131 కోట్ల ప్రజాధనాన్ని దోపిడి చేస్తున్నారని ఆరోపించారు. బైకు నుంచి లారీ వరకు కొనుగోళ్లపై జీవిత పన్ను 6శాతం పెంచారని, దేశంలోనే అత్యధిక డీజిల్, పెట్రోల్ ధరలు ఏపీ రాష్ట్రంలోనే ఉన్నాయన్నారు. ఇప్పటికే 3 సార్లు ఆర్టీసీ ఛార్జీలు, 2 రెట్లు మద్యం ధరలు పెంచారని, 7 సార్లు విద్యుత్ చార్జీలు పెంచి పేదలను దోచుకుంటున్నారని యనమల రామకృష్ణుడు తీవ్రస్థాయిలో దుయ్యబట్టారు. ఇదిలావుంటే కృష్ణా జిల్లా గుడివాడలో సైకో పోవాలి.. సైకిల్ రావాలంటూ టీడీపీ మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు వినూత్న కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా గురువారం ఆయన ఇక్కడ మీడియాతో మాట్లాడుతూ గుడివాడకు పట్టిన కొడాలి నాని శనిని అంత మొందించే రోజులు దగ్గరపడ్డాయన్నారు. సైకో పాలన నుండి ప్రజలకు విముక్తి కల్పించడమే లక్ష్యంగా టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు నాయకత్వంలో పోరాడుతామని వెంకటేశ్వరరావు స్పష్టం చేశారు. కాగా రాష్ట్రంలో జగన్ గుడివాడలో కొడాలి నాని పీడ విరగడ అవ్వాలని కోరుకుంటూ శ్రీ విజయ దుర్గ అమ్మవారికి టీడీపీ నేతలు పూజలు చేశారు. సైకో పోవాలి.. సైకిల్ రావాలంటూ దేవస్థానం బయట 108 సార్లు నినాదాలు చేశారు.

# రైతు సంక్షేమానికి పెద్దపీట: వంటేరు



సిద్దిపేట,జనవరి12(సమసమాజం): రైతుల సంక్షేమానికి సీఎం కేసీఆర్ నిరంతరంగా పాటుపడుతున్నారని అటవీ అభివృద్ధి సంస్థ ఛైర్మన్ వంటేరు ప్రతాపరెడ్డి అన్నారు. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర అందించేందుకు సీఎం నిరంతరంగా కృషిచేస్తున్నారన్నారు. సాగునీటిని అందించేందుకు ఎక్కడ అవసరం వస్తే అక్కడ రిజర్వాయర్లను నిర్మిస్తున్నారన్నారు. రైతుబంధు ద్వారా రైతులకు నేరుగా ఖాతాలోకి డబ్బులు జమవుతున్నాయని అన్నారు. క్రమం తపపకుండా రైతుబంధు సాయం అందుతున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ మాత్రమే అన్నారు,

# భారత్ ఘన విజయం

### 215 పరుగలకే చాపచుట్టిన లంక బ్యాటర్లు

కోల్‌కతా,జనవరి12(సమసమాజం):శ్రీలంకతో రెండో వన్డేలో భారత బౌలర్లు విజృంభించారు. టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన ప్రత్యర్థి లంక బ్యాట్స్‌మెన్లకు దడపుట్టించారు. కట్టుదిట్టమైన బౌలింగ్‌తో వరుస విరామాల్లో వికెట్లు తీసి 215 పరుగులకే ఆలౌట్ చేశారు. 39.4 ఓవర్లలోనే లంక బ్యాట్స్‌మెన్ చేతులు ఎత్తేశారు. భారత్ బౌలర్లలో అత్యధికంగా కుల్దీప్ యాదవ్, మహ్మద్ సిరాజ్ చెరో 3 వికెట్లు తీసి శ్రీలంక నడ్డివిరిచారు. ఉమ్రాన్ మాలిక్ 2 వికెట్లు, అక్షర్ పటేల్ 1 వికెట్ చొప్పున తీశారు. మరో వికెట్ రనౌట్ రూపంలో దక్కింది. నువనిడు ఫెర్నాండోను శుభ్‌మన్ గిల్/రాహుల్ రనౌట్‌గా వెనక్కుపంపారు. కాగా టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన శ్రీలంక బ్యాట్స్‌మెన్ ఆరంభంలో ఆచితూచి ఆడారు. 29 పరుగులకే తొలి వికెట్ పడినా.. ఆ తర్వాత 102 పరుగుల వద్ద 2వ వికెట్ కోల్పోయింది. కానీ ఆ తర్వాత పరిస్థితి ఒక్కసారిగా తలకిందులైంది. కేవలం 50 పరుగుల వ్యవధిలోనే ఏకంగా 6 వికెట్లు నష్టపోయింది. 152 పరుగుల వద్ద ఏడవ వికెట్ పడింది. చివరిలో టెయిలండర్లు ఫర్వాలేదనిపించడంతో ఈమాత్రం స్కోరైనా వచ్చింది.రెండో వన్డేలో శ్రీలంక 215 పరుగులు ఆలౌట్ అయింది. ఓపెనర్ నువనిదు ఫెర్నాండో (50) టెయిలెండర్లు వెల్లలాగే (32), వసనిందు హసరంగ (21), చమిక కరుణరత్నే(17) రాణించడంతో ఆ జట్టు రెండొందలకు పైగా పరుగులు చేయగలిగింది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న లంకను సిరాజ్ దెబ్బతీశాడు. ఐదోఓవర్‌లో ఓపెనర్ ఆవిష్క ఫెర్నాండోను అవుట్ చేశాడు. ఆ తర్వాత చైనామన్ స్పిన్నర్ కుల్దీప్ యాదవ్ కీలకమైన కుశాల్ మెండిస్ (34), దసున్ షనక (2), చరిత అసలంక (15) వికెట్లు తీసి లంక నడ్డి విరిచాడు. 177 పరుగుల వద్ద లంక 8 వికెట్లు కోల్పోయింది. దునిత్ వెల్లలాగే , కసున్ రజిత తొమ్మిదో వికెట్‌కు 38రన్స్ జోడించారు. సిరాజ్ 40 ఓవర్‌లో వెల్లలాగే, కుమరను అవుట్ చేయడంతో లంక ఇన్నింగ్స్ ముగిసింది. మ్యాచ్‌లో ఆల్‌రౌండర్ అక్షర్ పటేల్ అద్భుతంగా ఫీల్డింగ్ చేశాడు. ఒక వికెట్ పడగొట్టిన అక్షర్ పటేల్ మూడు క్యాచ్‌లు అందుకున్నాడు. ఉమ్రాన్ మాలిక్ రెండు, అక్షర్ పటేల్‌కు తలా ఒక వికెట్లు తీశారు.

## హైదరాబాద్ క్రికెట్ అభిమానులకు పండగ

### న్యూజిలాండ్‌తో 18న తొలి వన్డే

ముంబై,జనవరి12(సమసమాజం):కొత్త ఏడాదిలో తెలుగు రాష్ట్రాల్లోని క్రికెట్ అభిమానులకు శుభవార్త చేరింది. ఇండియా, న్యూజిలాండ్ జట్ల మధ్య తొలి వన్డే ఈనెల 18న హైదరాబాద్ వేదికగా జరగనుంది. భారత పర్యటనలో కేన్ విలియమ్సన్ నేతృత్వంలోని కివీస్ మూడు వన్డేల సిరీస్, 3 టీ20ల సిరీస్ ఆడనుంది.


లక్ష్యం చిన్నదే.. కానీ, టాపార్డర్ విఫలం కావడంతో కేఎల్ రాహుల్, హార్దిక్ పాండ్యా జట్టును గెలిపించే భాద్యత తీసుకున్నారు. భారత్ 180 పరుగులు చేసి ఐది వికెట్లు కోల్పోయింది. సాధించాల్సిన రన్‌రేట్ 3.74 ఉండడతో వీళ్లిద్దరూ మరో వికెట్ పడకుండా జాగ్రత్తగా ఆడుతున్నారు. ఐదో వికెట్‌కు రాహుల్, పాండ్యా అర్థ సెంచరీ (60) భాగస్వామ్యం నిర్మించారు. 97 బంతుల్లో 60 పరుగులు జోడించారు.



## హైదరాబాదీ సిరాజ్ అద్భుత బౌలింగ్

### సెన్సేషన్ స్వింగర్‌తో మిడ్ వికెట్ డౌన్

కోల్‌కతా,జనవరి12(సమసమాజం): హైదరబాదీ పేసర్ మహ్మద్ సిరాజ్ వన్డేల్లో నిలకడైన ప్రదర్శన చేస్తున్నాడు. ఫస్ట్ వన్డేలో అద్భుతమైన బౌలింగ్‌తో టీమిండియా విజయంలో కీలకపాత్ర పోషించిన సిరాజ్..రెండో వన్డేలోనూ కీలక వికెట్లు తీసుకున్నాడు. ఇన్ స్వింగర్లు, ఔట్ స్వింగర్లుతో లంక బ్యాట్స్‌మన్ ను ముప్పుతిప్పలు పెట్టాడు. సెన్సేషన్ స్వింగర్‌తో లంక బ్యాట్స్‌మన్÷–ను క్లీన్ బౌల్డ్ చేశాడు. ఈ మ్యాచ్?లో సిరాజ్ మొత్తంగా మూడు వికెట్లు పడగొట్టాడు. 5.4 ఓవర్లు వేసిన సిరాజ్..30 పరుగులిచ్చి 3 వికెట్లు పడగొట్టడంతో..శ్రీలంక 215 పరుగులకే ఆలౌట్ అయింది.





## కోహ్లీ మరో రికార్డు

### సెంచరీ కొట్టిన ప్రతిసారీ టీమిండియా విజయం

ముంబై,జనవరి12(సమసమాజం)::టీమిండియా ఛేజింగ్ మాస్టర్ విరాట్ కోహ్లీ మరో అరుదైన రికార్డును సొంతం చేసుకున్నాడు. శ్రీలంకతో జరిగిన వన్డే మ్యాచ్ కోహ్లి సెంచరీ చేసి భారీ స్కోర్ చేసేందుకు సాయపడ్డాడు. అయితే, ఈ మ్యాచ్ విజయంతో కోహ్లీ మరొక రికార్డ్ ని తన పేరిట రాసుకున్నాడు. వన్డే ఛేజింగ్ లో విరాట్ కి మొత్తం 37 సెంచరీలు ఉండగా.. కోహ్లి సెంచరీ చేసిన 37 సార్లు టీమిండియా గెలిచింది. దీంతో వన్డే చరిత్రలో 37 విన్నింగ్ నాక్స్ ఆడిన తొలి ఆటగాడిగా కింగ్ కోహ్లి రికార్డు సృష్టించాడు. అయితే, ఇదివరకు ఈ రికార్డ్ సచిన్ టెండూల్కర్ పేరిట ఉండేది. సచిన్ 33 సార్లు విన్నింగ్ నాక్స్ ఆడాడు.









## వాల్తేరు వీరయ్యపై భారీ అంచనాలు

### నేడు థియేటర్లలో సందడి చేయనున్న చిరు

సంక్రాంతి రేసులో వాల్తేరు వీరయ్యగా పోటీలో దిగుతున్నాడు మెగాస్టార్ చిరంజీవి. మెగా ఫ్యాన్స్ అందరికి మాస్ ఫీస్ట్ అందించేలా చిరు సినిమా శుక్రవారం ప్రేక్షకుల ముందుకు రాబోతంది. గురువారం బాలయ్య సినిమా, శుక్రవారం చిరు సినిమాలతో ఇక అభిమానులు పండగ చేసుకుంటున్నారు. ఈ సినిమా ప్రమోషనల్ ఇంటర్వ్యూస్ లో మైత్రి నిర్మాతల ఖర్చు గురించి ప్రత్యేకంగా చెప్పారు చిరు. ముఖ్యంగా బాస్ పార్టీ సాంగ్ కోసం ఒక భారీ సెట్ వేయించారని. ఆ పాట అద్భుతంగా వచ్చినా ఆ సాంగ్ కోసం అంత ఖర్చు పెట్టాల్సిన అవసరం లేదని అన్నారు. కథలో విషయం ఉంటే ఇమేజ్ ఫ్యాక్టర్ దాటి సినిమాలు ఆడతాయని అన్నారు.మూవీ మేకింగ్ లో నిర్మాతలు చాలా జాగ్రత్తగా ఉండాలని.. దర్శకులు కూడా సినిమాను బాగా వచ్చేలా చేసుకోవాలని అన్నారు. ఇక సినిమా షూట్ చేసినదంతా కూడా ఉపయోగపడేలా ఉండాలని చిరంజీవి అన్నారు. బాస్ పార్టీ సెట్ కోసం మైత్రి వారు భారీ మొత్తాన్ని ఖర్చు పెట్టారని.. ఆ సెట్ వేసే ముందే టీం తనతో చర్చించి ఉంటే తాను వద్దనేవాడినని అన్నారు. సక్సెస్ పర్సెంటేజ్ కూడా ఈ నిర్మాణ సంస్థకు ఎక్కువ ఉండటం కూడా వారి భారీ తనానికి ఒక కారణమని చెప్పొచ్చు.వాల్తేరు వీరయ్య మైత్రి మూవీ మేకర్స్ నుంచి వస్తున్న మరో భారీ సినిమా అని తెలుస్తుంది. చిరు రవితేజ సీన్స్ థియేటర్ లో ఆడియన్స్ కు పూనకాలు తెప్పిస్తాయని తెలుస్తుంది. దేవి శ్రీ ప్రసాద్ మ్యూజిక్ ఆల్రెడీ సినిమాపై ఒక హైప్ క్రియేట్ చేసింది. బాబీ ఈ సినిమాపై పూర్తి నమ్మకంగా ఉన్నాడు. మరి చిరు అండ్ టీం ఈసారి హిట్టు కొడుతున్నాం అని చెప్పిన మాటలు నిజమవుతాయా లేదా అన్నది మరికొద్ది గంటల్లో తెలుస్తుంది.

## బాలకృష్ణకు కలసివచ్చిన ఫ్యాక్షన్ నేపథ్యం

### వీరసింహారెడ్డిలో గెటప్‌తో అదరగొట్టిన బాలయ్య

సంక్రాంతి సినిమాల్లో తిరుగులేని రికార్డున్న హీరోల్లో నందమూరి బాలకృష్ణ ఒకరు. ఈసారి మళ్లీ ఆయన పండుగ రేసులోకి వచ్చారు. 'అఖండ' లాంటి బ్లాక్ బస్టర్ తర్వాత ఆయన.. చేసిన సినిమా 'వీరసింహారెడ్డి' సంక్రాంతి కానుకగా భారీ అంచనాల మధ్య ప్రేక్షకుల ముందుకు వచ్చింది. మరో రాయలసమీా నేపథ్యం ఉన్న కథ కావడంతో ఆసక్తి పెరిగింది. జై (బాలకృష్ణ) ఇస్తాంబుల్లో తన తల్లితో కలిసి ఒక రెస్టారెంట్ నడుపుతూ ఉంటాడు. అతడికి అక్కడే పరిచయమైన ఈషా (శ్రుతి హాసన్)తో పెళ్లి నిశ్చయం అవుతుంది. అప్పటిదాకా జైకి తన తండ్రి గురించి ఏమీ తెలియదు. ఆయన చనిపోయాడని అనుకుంటుంటాడు. కానీ అప్పుడే తల్లి తండ్రి గురించి చెబుతుంది. రాయలసీమలో జై తండ్రి వీరసింహారెడ్డి ఒక పెద్దమనిషి. ఆ ప్రాంతం మీద కన్ను వేసి.. తనను ఎప్పుడు చంపుదామా అని చూస్తున్న ప్రతాపరెడ్డి (దునియా విజయ్)తో ఎదుర్కొంటూ అక్కడే ఉన్న వీరసింహారెడ్డి.. కొడుకు పెళ్లి కోసమని ఇస్తాంబుల్ వస్తాడు. అక్కడ కూడా అతడి మీద దాడి జరుగుతుంది. మరి ఆ దాడి నుంచి వీరసింహారెడ్డి ప్రాణాలతో బయటపడ్డాడా.. ఇంతకీ ప్రతాపరెడ్డితో అతడి వైరం ఏంటి.. భార్యా బిడ్డలకు దూరంగా వీరసింహరెడ్డి సీమలో ఎందుకుంటున్నాడు.. ఈ విషయాలన్నీ తెర మీదే చూడాలి. రాయలసీమను కంటిచూపుతో శాసిస్తూ అక్కడి జనాలకు అండగా నిలిచే పెద్ద మనిషి పాత్ర బాలయ్యకు ఎంతమాత్రం కొత్త కాదు. ఆయన ఖద్దరు చొక్కా వేసి.. కత్తి పట్టి శత్రువుల మీదికి దండెత్తడం కొత్త కాదు. పవర్ ఫుల్ పౌరుషం డైలాగులు చెప్పడమూ కొత్త కాదు. 'వీరసింహారెడ్డి'లోనూ మళ్లీ ఇవే చూస్తాం. మామూలుగా సీమ నేపథ్యంలో సినిమా అంటే హీరో ఇక్కడే ఉండి శత్రువుల తలలు నరుకుతాడు. కానీ 'వీరసింహారెడ్డి'లో బాలయ్య ఫారిన్ కంట్రీలో అడుగు పెట్టి అక్కడ కూడా శత్రువులకు తన కత్తి పదును చూపిస్తాడు. బాలయ్యను పవర్ ఫుల్ గా చూపించడంలో గోపీచంద్ విజయవంతం అయ్యాడు. వీరసింహారెడ్డి పాత్రలో బాలయ్య గెటప్ దగ్గర్నుంచి అన్నీ సూపర్ అనిపిస్తాయి. సీన్లు కొత్తగా అనిపించకపోయినా.. అభిమానులు–మాస్ ప్రేక్షకులకు గూస్ బంప్స్ ఇచ్చేలా వాటిని డిజైన్ చేశాడు గోపీచంద్.నందమూరి బాలకృష్ణకు పవర్ ఫుల్ పాత్ర పడితే ఎలా చెలరేగిపోతాడో 'వీరసింహారెడ్డి'తో మరోసారి రుజువైంది. వీరసింహారెడ్డిగా బాలయ్య గెటప్ దగ్గర్నుంచి అన్నీ బాగా కుదిరాయి. ఇలాంటి పాత్రలు బాలయ్యకు సెట్ అయినట్లు ఇంకెవరికీ కావు అనే రేంజిలో ఆ పాత్రలో నందమూరి హీరో అదరగొట్టాడు. ఆ పాత్ర వీరత్వం చూపించే సన్నివేశాలు బాగా పండాయి. అతడితో పోలిస్తే వరలక్ష్మి శరత్ కుమార్ కొంచెం బెటర్. 'క్రాక్'లో జయమ్మ స్థాయిలో లేకపోయినా ఆమె పాత్ర పర్వాలేదనిపిస్తుంది. తన నటన కూడా బాగుంది. వీరసింహారెడ్డి కుడి భుజం పాత్రలో లాల్ బాగా చేశాడు. ఎంతసేపూ బాలయ్యను యాక్షన్ సన్నివేశాలు.. డైలాగులతో ఎలా ఎలివేట్ చేయాలని చూశాడే తప్ప.. కథాకథనాల మీద పెద్దగా దృష్టిపెట్టినట్లు కనిపించదు. ఎలివేషన్.. యాక్షన్ సీన్లను బాగా హ్యాండిల్ చేశాడు.. సీనియర్ బాలయ్యను బాగా చూపించాడు తప్ప.. ఇంకే ప్రత్యేకతా చూపించలేకపోయాడు.

Edited, Printed, Published & owned by **GOSUKONDA PRUDHVIRAJU**, Published From, H.No. 6-17, VI:PALIVELA, MANDAL:MUNUGODE, DIST: NALGONDA - 508244, TELANGANA,
Printed at **Panidhar PUBLICATIONS**. H.NO: 6-17, VI:PALIVELA, MANDAL:MUNUGODE, DIST: NALGONDA - 508244, Editor: **GOSUKONDA PRUDHVIRAJU**,
RNI.TELTEL/2016/ 73311, Cell:8464816456 Email: samasamajamdaily@gmail.com, Website: www.samasamajam.in